

# భానుడి భగభగలు!

## జిల్లాలో 20 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు

- రికార్డు స్థాయిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- రావికమతం మండలంలో 45.1 డిగ్రీలు నమోదు
- వేడిగాలులు, ఉక్కపోతతో అల్లాడిన జనం
- మరో రెండు రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని శాస్త్రవేత్తలు వెల్లడి



నిర్మానుష్యంగా మారిన సబ్బవరం మెయిన్ రోడ్డు

**అనకాపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలో మంగళవారం ఎండలు దారెత్తించాయి. నాలుగు మినహా మిగిలిన 20 మండలాల్లో తీవ్రవడగాడ్పులు వీశాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచే భానుడు ప్రతాపం చూపడడంతో జనం బెంబేలెత్తిపోయారు. ఉదయం 11 గంటల నుంచి రహదారులపై జన సంచారం పూర్తిగా తగ్గిపోయింది. పట్టణ ప్రాంతాల్లో ప్రధాన రహదారులు సైతం బోసిపోయాయి. అత్యవసర పనులు వుంటే తప్ప జనం ఇళ్ల నుంచి బయటకు రాలేదు. ఇళ్లల్లో వున్నప్పటికీ వేడి గాలులకుతోడు ఉక్కపోత అధికంగా వుండడంతో ఇబ్బంది పడ్డారు. చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు వడగాడ్పులకు సొమ్మసిల్లిపోతున్నారు. ఉపాధి పనులకు వెళ్లిన కూలీలు ఎండకు తాళలేక కొద్దిసేపటికే తిరుగుముఖం పడుతున్నారు. రహదారుల పక్కన చిరువ్యాపారులు ఉదయం పది గంటలకే తట్టాబుట్టా సర్దుకుని ఇంటిముఖం పట్టారు. కాగా జిల్లాలో రాంబిల్లి (39.7 డిగ్రీలు) తప్ప మిగిలిన అన్ని మండలాల్లో 40 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 45.1 డిగ్రీలతో రావికమతం మండలం మొదటి స్థానంలో నిలిచింది. మండలాల వారీగా పరిశీలిస్తే.. దేవరాపల్లి, చీడికాడల్లో 44.8, మాడుగులలో 44.3, గొలుగొండలో 44.2, రోలుగుంటలో 44.1, చోడవరంలో 43.8, కోటవురట్లలో 43.6, కశింకోట, మాకవరపాలెంలో 43.4, కె.కోటపాడులో 42.8, అనకాపల్లి, సబ్బవరంలో 42.7, మునగపాకలో 42.6, నర్సీపట్నంలో 42.4, బుచ్చెయ్యపేటలో 42.2, నాతవరం, ఎలమంచిలిలో 41.8, నక్కపల్లిలో 41.3, పరవాడలో 40.9, ఎస్.రాయవరంలో 40.7, అచ్యుతాపురంలో 40.6, పాయకరావుపేటలో 40.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటి నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని, ఎండలు, వడగాడ్పుల తీవ్రత మరింత ఎక్కువ వుంటుందని వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది.

## 20వ తేదీన తేలికపాటి జల్లులు

- ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ పీవీకే జగన్నాథరావు

**తుమ్మపాల, ఏప్రిల్ 16:** రాగల ఐదు రోజుల్లో ఉమ్మడి విశాఖ జిల్లాలో వాతావరణం పొడిగా ఉండి 20వ తేదీన తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ పీవీకే జగన్నాథరావు పేర్కొన్నారు. మంగళవారం ఆర్ఏఆర్ఎస్‌లో శాస్త్రవేత్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా రైతులు రబీ పంటలకు ఎరువులు వేయడం వాయిదా వేసుకోవాలని సూచించారు. మామిడి, జీడిమామిడి తోటలకు తరచూ నీరు పెట్టుకోవాలన్నారు. పశువులు, కోళ్లను నీడ ప్రదేశంలో ఉంచి, తాగునీటిని అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో శాస్త్రవేత్తలు సీహెచ్.ముకుందరావు, డాక్టర్ బి.గౌరి, డాక్టర్ ఎం.విశాలాక్షి, డాక్టర్ ఎ.శిరీషా, డాక్టర్ వి.చంద్రశేఖర్, డాక్టర్ పీవీ పద్మావతి, డాక్టర్ ఎ.అలివేణి తదితరులు పాల్గొన్నారు.



సీఎం రమేశ్



# అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా..

## పారిశ్రామిక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

### యువతకు స్థానికంగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

- ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్
- గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక
- కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్లు ఖాయం
- పీఎం సడక్ యోజన కింద గ్రామీణ రహదారులకు అధిక నిధులు
- రైతు సంక్షేమం, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం
- సముద్ర తీరప్రాంతాల్లో గ్రీన్ హైడ్రోజన్ పవర్ ప్లాంట్లు
- సమస్యలను పరిష్కరించే సమర్థత, నిబద్ధత ఉన్నాయి
- టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో వైసీపీ నేతలకు ఓటమి భయం
- అందుకే నాపై దుష్ప్రచారం చేస్తున్నారు
- ఎక్కడకు వెళ్లినా..ప్రజల నుంచి అపూర్వ ఆదరణ
- వైసీపీకి ఒక్కసారి అవకాశం ఇచ్చి.. భవిష్యత్తును కోల్పోయామని యువతలో ఆవేదన

**'ఆంధ్రజ్యోతి'తో అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్**



సీఎం రమేశ్

**ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ**

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేయించి, పారిశ్రామికంగా ప్రగతి పరుగులు పెట్టించడం ద్వారా ఈ ప్రాంత యువత, నిరుద్యోగులకు ఇక్కడే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నది తన ప్రధాన లక్ష్యమని కూటమి తరపున అనకాపల్లి పార్లమెంట్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎం రమేశ్ అన్నారు. కేంద్రంలో మరోసారి ఎన్డీఏ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు ఏర్పాటుకావడం ఖాయమని, డబుల్ ఇంజన్ సర్కార్‌తో జిల్లాలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో తనను ఎంపీగా గెలిపిస్తే జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. కూటమి తరపున అనకాపల్లి ఎంపీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎం రమేశ్...ప్రజల నుంచి వస్తున్న ఆదరణ, ఎంపీగా గెలుపొందిన తరువాత అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధికి అమలు చేయడానికి రూపొందించుకున్న ప్రణాళిక, ఇతర అంశాల గురించి మంగళవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వివరించారు. ఆయా వివరాలు ఆయన మాటల్లోనే....

అనకాపల్లి లోక్‌సభ స్థానం నుంచి కూటమి తరఫున బీజేపీ అభ్యర్థిగా నా పేరు ప్రకటించిన తరువాత జిల్లాలో దాదాపు అన్ని ప్రాంతాల్లో పర్యటించాను. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో యువత అధికంగా వున్నారు. వీరిలో ఎక్కువ మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఇబ్బంది పడుతున్నట్టు గుర్తించాను. వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లాకు ఒక్కటంటే ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. వైసీపీకి ఒక్కసారి అవకాశం ఇచ్చిన పాపానికి తమ భవిష్యత్తును నాశనం చేసుకున్నామని ఎంతోమంది యువకులు నా వద్ద బాధ, ఆవేదనను వ్యక్తం చేశారు. జిల్లాలో ఎక్కడకు వెళ్లినా..వైసీపీ పాలనలో అనకాపల్లి జిల్లా మరింత వెనుకబాటుకు గురైందని జనం అంటున్నారు. జిల్లా నుంచి ఇద్దరు మంత్రులు, ఒక ఎంపీ ఉన్నప్పటికీ గ్రామాలకు రోడ్లు వేయించ లేకపోయారు. ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పరిశ్రమల శాఖా మంత్రి, అనకాపల్లి జిల్లాకు కొత్తగా ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాలేకపోయారు. వైసీపీ పాలనతో అభివృద్ధిలో వెనుకబడిన అనకాపల్లి జిల్లాలో ప్రజలు ఇప్పుడు అదే విషయంపై చర్చించుకుంటున్నారు.

### సమస్యలను పరిష్కరించే సమర్థత, నిబద్ధత ఉన్నాయి

తెలుగుదేశం, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేస్తుండడంతో వైసీపీ నేతలకు ఇప్పటికే ఓటమి భయం పట్టుకుంది. దీంతో స్థానికేతరుడినంటే నాపై దుష్ప్రచారం చేస్తున్నారు. అభ్యర్థి స్థానికుడా? స్థానికేతరుడా? అన్నది ఇక్కడ ముఖ్యం కాదు. ప్రజల సమస్యలను పరిష్కరించగలిగిన సత్తా, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయగల నిబద్ధత, సమర్థత వుండడం ముఖ్యం. రెండు పర్యాయాలు (12 ఏళ్లపాటు) రాజ్యసభ సభ్యునిగా పనిచేసిన నాకు ఇవన్నీ వున్నాయి. నాపై వైసీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. సుదీర్ఘకాలం తెలుగుదేశం పార్టీలో పనిచేసిన నాకు..ఈ ప్రాంతానికి చెందిన అనేక మంది టీడీపీ సీనియర్ నాయకులతో సత్సంబంధాలు ఉన్నాయి. కేంద్రంలో మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ హయాంలోనే జాతీయ రహదారులు అభివృద్ధి చెందాయి. కేంద్రంలో వరుసగా మూడోసారి మోదీ నేతృత్వంలో ఎన్డీఏ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు ఏర్పడడం ఖాయం.

### ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

ఈ ప్రాంత యువత, నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టిపెడతాం. యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ (నైపుణ్యాభివృద్ధి శిక్షణ) అవసరం. జిల్లాలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటుచేస్తాం. పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టిపెడతాం. ఈ ప్రాంతానికి పరిశ్రమలు అధికంగా వస్తే, ఇక్కడి యువత ఉద్యోగ, ఉపాధి కోసం ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం ఉండదు.

### రైతు సంక్షేమం, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

జిల్లాలో వ్యవసాయం, అనుబంధ రంగాలపై ఆధారపడి జీవించే ప్రజలు ఎక్కువగా ఉన్నారు. రైతుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తాం. జిల్లాలో వరి సాగు చేసే రైతులు ఏటా సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో పర్యటించినప్పుడు.. వైసీపీ పాలనలో రైవాడ, పెద్దేరు, కోనాం జలాశయాలు, కాలువల ఆధునీకీకరణ పనులు జరగలేదని రైతులు చెప్పారు. శారదా నదిపై పలుచోట్ల గ్రోయిన్‌లకు మరమ్మతులు చేయలేదు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. రైతులు పండించిన కూరగాయలు, ఇతర ఆహార ఉత్పత్తులను గిట్టుబాటు ధరలకు అమ్ముకోవడానికి ... మిగతా 4వ పేజీలో

# స్ఫూర్తిదాయకం.. హనిత విజయం



వేములపాటి హనిత

**సివిల్స్‌లో సత్తా చాటిన వేములపాటి హనిత**

- 887 ర్యాంకు సాధన..
- అరుదైన వ్యాధితో పదేళ్లుగా వీల్ చైర్‌కే పరిమితం
- దూరవిద్యలో డిగ్రీ, ఆపై సివిల్స్‌పై గురి
- నాలుగో ప్రయత్నంలో విజయం

**విశాఖపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి):** ఆమె చిన్నప్పటి నుంచి చదువులో చురుగ్గా ఉండేది. ఆ ప్రతిభే ఐఐటీలో ఇంజనీరింగ్ సీటు తెచ్చిపెట్టింది. అయితే అదే సమయంలో అనారోగ్యం బారినపడడంతో బీటెక్ పూర్తిచేయలేకపోయింది. ఊహించని పరిణామంతో రెండేళ్లు మానసికంగా కుంగిపోయింది. కానీ తల్లిదండ్రులు, సన్నిహితుల ప్రోత్సాహంతో దూరవిద్యలో డిగ్రీ పూర్తిచేసింది. తరువాత సివిల్స్ లక్ష్యంగా పెట్టుకుని, నాలుగో విడతలో సాధించింది. యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్-2023 ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. విశాఖలోని కిర్లంపూడి లేఅవుట్ ప్రాంతానికి చెందిన వేములపాటి హనిత 887 ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడిన ఆమె సివిల్స్ బాట పట్టడానికి గల కారణాలు, ఆ ప్రయత్నంలో ఎదుర్కొన్న ఇబ్బందులు, అధిగమించేందుకు పడిన శ్రమ వంటి వాటిని వివరించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే....

**అనుకోకుండా సివిల్స్ వైపు ప్రయాణం..**

అమ్మ ఇందిర ఐసీడీఎస్‌లో సూపర్‌వైజర్. నాన్న వేములపాటి రాఘవేంద్రరావు ఇండియన్ రైల్వేలో సీనియర్ ఇన్‌స్పెక్టర్. ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకు విశాఖలోనే చదివాను. తరువాత ఖరగ్‌పూర్ ఐఐటీలో బీటెక్‌లో చేరా. అయితే ఆ సమయంలో అనారోగ్యం బారినపడడంతో బీటెక్ పూర్తిచేయలేకపోయా. వెన్నముక ఇన్‌ఫెక్షన్ బారినపడి పెరాలసిస్ వచ్చింది. కాళ్లు పూర్తిగా చచ్చుబడిపోయాయి. అనేక ఆస్పత్రులకు తిరిగినా ప్రయోజనం లేకుండాపోయింది. రెండేళ్లపాటు డిప్రెషన్‌లోకి వెళ్లిపోయా. తల్లిదండ్రుల సహకారం, గురువు రామదూతస్వామి ప్రోత్సాహంతో మళ్లీ సాధారణ స్థితికి రాగలిగాను. ఆయన సూచనతోనే దూరవిద్యలో డిగ్రీ పూర్తిచేశాను. ఆ తరువాత సివిల్స్ దిశగా ప్రయాణం ప్రారంభించా. 2020లో తొలిసారి అటెమ్ట్ చేశా. మూడు ప్రయత్నాల్లో మెయిన్స్‌లో విఫలమయ్యాను. నాలుగో ప్రయత్నంలో మెయిన్స్, ఇంటర్వ్యూ క్లియర్ చేయడంతోపాటు మంచి ర్యాంకు సాధించాను. గత ఏడాది గ్రూప్-1లో ఏవో ఉద్యోగానికి ఎంపికయ్యాను. ప్రస్తుతం మానసిక ఆస్పత్రిలో ఏవో పనిచేస్తున్నాను.

# ఉత్తుత్తి సహకారం

**ఐదేళ్ల నుంచి వేతనాల పెంపునకు నోచుకోని సహకార సంఘాల ఉద్యోగులు**




- వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో ఎంఎస్ నంబరు-36 జారీ
- వేతనాలు పెరుగుతాయని ఆశించిన ఉద్యోగులు
- పూర్తిస్థాయిలో అమలు చేయని డీసీసీబీ అధికారులు
- జిల్లాలో 98 సంఘాలు... వేతనాల జీవో అమలైంది ఏడెనిమిది సంఘాలకే!
- సంఘాల ఆదాయంతో ముడిపెడుతున్న అధికారులు
- అరకొర వేతనాలతో భారంగా మారిన కుటుంబ పోషణ



రావికమతం మండలం చినపాచిల సహకార సంఘం కార్యాలయం

**చోడవరం, ఏప్రిల్ 16:**

**సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల వేతనాలు పెంపు అమలు కోసం వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నంబరు 36 కాగితాలకే పరిమితమైంది. జీవో జారీ చేసి నాలుగున్నరేళ్లు దాటినా అమలు కాకపోవడంతో సహకార సంఘాల ఉద్యోగులు తీవ్రంగా మండిపడుతున్నారు.**

వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో సహకార ఉద్యోగులకు వేతనాల పెంపు అమలు చేస్తున్నట్టు ఆర్భాటంగా ప్రకటించింది. దీనికి సంబంధించి జీవో ఎంఎస్ నంబరు 36 జారీకావడంతో తమ కష్టాలు తీరుతాయని సహకార సంఘాల ఉద్యోగులు ఎంతో సంబరపడ్డారు. కానీ డీసీసీబీ అధికారులు ఈ జీవోను ఐదేళ్ల నుంచి అమలు చేయలేదు. వేతనాల పెంపు కోసం ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్న ఉద్యోగులు తీవ్ర అసహనం చెందుతున్నారు. ఏళ్ల తరబడి అరకొర వేతనాలతో పనిచేస్తున్న తమకు జీవో ఎంఎస్ నంబర్ 36 ప్రకారం వేతనాలు పెంపు అమలుచేయాలని కోరుతున్నప్పటికీ డీసీసీబీ అధికారుల నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో తీవ్ర అసంతృప్తి చెందుతున్నారు. వేతనాల పెంపుకోసం అధికారులను గట్టిగా నిలదీసే ఘటనలు ఎక్కువయ్యాయి.

సహకార సంఘాల ఉద్యోగుల దశాబ్దాల డిమాండ్ మేరకు రాష్ట్ర ప్రభుత్వం 2019లో సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాల పెంపు అమలు చేయాలని సూచిస్తూ జీవో జారీ చేసింది. సహకార సంఘాల ఉద్యోగుల వేతనాలను ఆప్కాబ్ 30 శాతం, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు 40 శాతం, సహకార సంఘం 20శాతం చొప్పున భరిస్తూ వారికి వేతనాల పెంపు అమలు చేసేలా ప్రభుత్వం మార్గదర్శకాలు సూచించింది. అయితే ఈ జీవో వచ్చి నాలుగున్నరేళ్లు గడచినా, ఉమ్మడి జిల్లాలో 28 డీసీసీబీ శాఖల్లో రెండు, మూడు బ్రాంచీల పరిధిలో.. అది కూడా ఏడెనిమిది సంఘాలకే వేతన పెంపును అమలు చేశారు. దీనిపై మిగిలిన ఉద్యోగులు మండిపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 98 సహకార సంఘాలు ఉండగా కేవలం ఏడు శాతం సంఘాల్లోనే వేతన పెంపు అమలవుతున్నది. సహకార సంఘాల ఆదాయాన్ని పెంచి.. పెరిగిన ఆదాయంలో వేతనాలు తీసుకోవాలని ఒకసారి, వేతనాల పెంపు అమలు కోసం ఆప్కాబ్‌కు లేఖ రాశామని, అక్కడ నుంచి నిధులు వస్తే వేతన పెంపు అమలు చేస్తామని మరోసారి డీసీసీబీ అధికారులు రకరకాల కారణాలు చెప్పి జీవో అమలు చేయకపోవడంతో ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీసీసీబీ లక్ష్య సాధన కోసం క్షేత్రస్థాయిలో కష్టాలు పడి ఆదాయం సమకూరుస్తున్నప్పటికీ, డీసీసీబీ అధికారులు తమకు వేతనాల పెంపు అమలు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తుండడంపై సహకార ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలోని 98 సహకార సంఘాల్లో సుమారు 250 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. దిగువ స్థాయి సిబ్బందికి కనీస వేతనం రూ.11 వేలు వుండగా, చాలా సీనియర్ ఉద్యోగి వేతనం రూ.42 వేలుకి మించి లేదని అంటున్నారు. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, అరకొర వేతనాలతో కుటుంబాలను ఎలా నెట్టుకుని రాగలమని ఉద్యోగులు వాపోతున్నారు. జీవో అమలైతే ఒక్కో ఉద్యోగికి రూ.4 వేల నుంచి రూ.8 వేల వరకు జీతాలు పెరిగే అవకాశం వుంది. కాగా కొన్ని సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, జీవో 36 ప్రకారం వేతనాలు తీసుకోవాలని భావించగా, ఆడిట్ రికవరీల పేరుతో అదనంగా తీసుకున్న వేతనాలను వెనక్కి తీసుకుంటారన్న భయంతో ముందడుగు వేయలేకపోతున్నారని అంటున్నారు. తాము కష్టపడి పనిచేయడం వల్లే డీసీసీబీకి ఆదాయం వస్తున్నదని, అధికారులు మాత్రం తమ వేతనాలను పెంచడంలేదని ఉద్యోగులు మండిపడుతున్నారు. గట్టిగా నిలదీస్తే.. సంఘం ఆదాయం ప్రకారం మీ వేతనాలు తీసుకోవాలని మెలిక పెడుతుండడంతో, ప్రస్తుతం వచ్చే వేతనాలు తగ్గిపోతాయన్న భయంతో ఉద్యోగులు వేతనాల పెంపు కోసం గట్టిగా ప్రశ్నించలేని పరిస్థితి నెలకొందని అంటున్నారు. మొత్తం మీద సహకార సంఘాల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాల పెంపు జీవో నాలుగున్నరేళ్ల నుంచి కాగితాలకే పరిమితం కావడంపై ఉద్యోగులు మండిపడుతున్నారు.

# టీడీపీలోకి కొణతాల రఘునాథ్

- కండువా కప్పి ఆహ్వానించిన అధినేత చంద్రబాబు



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన రఘునాథ్. పక్కన బుద్ద నాగజగదీశ్వరరావు

**అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16:** స్థానిక ఆదినారాయణ మహిళా కళాశాల కరస్పాండెంట్, అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం కూటమి అభ్యర్థి కొణతాల రామకృష్ణ సోదరుడు రఘునాథ్ మంగళవారం తెలుగుదేశంలో చేరారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సోమవారం శ్రీకాకుళం జిల్లా పలాసలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నారు. రఘునాథ్ మంగళవారం ఉదయం స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న కుమారుడు శ్యామసుందర శివాజీ నివాసంలో చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. తాను టీడీపీలో చేరాలని భావించినట్టు చెప్పగా, చంద్రబాబు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని, అధికారంలోకి వచ్చిన తగిన గుర్తింపు ఉంటుందని చంద్రబాబు హామీ ఇచ్చినట్టు రఘునాథ్ చెప్పారు. ఆయన వెంట టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు వున్నారు.

# కష్టాల్లో గోపాలమిత్రలు

**హామీలను గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం**

- ఐదేళ్ల నుంచి నగదు ప్రోత్సాహకాలు నిలుపుదల
- ఉమ్మడి విశాఖ జిల్లాలో రూ.4 కోట్ల మేర బకాయిలు
- ఉద్యోగాల నుంచి తొలగింపునకు ప్రభుత్వం యత్నం
- కోర్టును ఆశ్రయించి కొలువులు నిలుపుకున్న గోపాలమిత్రలు
- ఆరు నెలల నుంచి అందని గౌరవ వేతనాలు



వైద్య సేవల వివరాలు నమోదు చేసుకుంటున్న గోపాలమిత్ర

**సబ్బవరం, ఏప్రిల్ 16:** గోపాలమిత్రలు.. రెండున్నర దశాబ్దాలుగా పశుపోషణ రైతులకు బాగా పరిచయం ఉన్న పేరు. మారుమూల గ్రామాలకు సైతం వెళ్లి పశువులకు వైద్య సేవలు అందిస్తుంటారు. కానీ గోపాలమిత్రలను వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసింది. గత ఎన్నికల ముందు అప్పటి ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ ఇంతవరకు అమలు చేయలేదు సరికదా.. రెండు దశాబ్దాల నుంచి పశువులకు సేవలు అందిస్తున్న గోపాలమిత్రలను పక్కన పెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది. అయితే గోపాలమిత్రలు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ప్రభుత్వం వెనక్కు తగ్గింది.

**2001లో గోపాలమిత్రలు ఏర్పాటు**

పశువుల్లో కృత్రిమ గర్భధారణ ద్వారా మేలు రకం పశుజాతిని పెంపొందించాలన్న ఉద్దేశంతో 2001లో తెలుగుదేశం ప్రభుత్వం గోపాలమిత్రల వ్యవస్థను తీసుకొచ్చింది. ఇంటర్ చదివి, పశువైద్యంపై ఆసక్తి కలిగిన యువకులను ఎంపిక చేసి పశు సంవర్ధక శాఖ ద్వారా శిక్షణ ఇచ్చింది. అనంతరం గోపాలమిత్రలను స్థానికంగా నియమించి పశుపోషణ రైతులకు చేరువ చేసింది. అప్పటి నుంచి వీరంతా రైతులకు అందుబాటులో ఉంటూ పశువులకు వ్యాధుల నివారణతోపాటు కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు ఇచ్చి మేలు జాతి పశువుల వృద్ధికి కృషి చేస్తున్నారు. ప్రభుత్వం గౌరవ వేతనం రూ.1,000 చెల్లించేది ప్రభుత్వం. 2004 తరువాత అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం.. 2008లో గోపాలమిత్రల గౌరవ వేతనం రూ.1,200లకు పెంచింది. రాష్ట్ర విభజన తరువాత టీడీపీ మళ్లీ అధికారంలోకి రాగా.. 2018లో సీఎం చంద్రబాబునాయుడు.. గోపాలమిత్రల గౌరవ వేతనాన్ని రూ.6,500కు పెంచుతూ జీవో విడుదల చేశారు. ఇదిలావుండగా తాము అధికారంలోకి వచ్చిన వెంటనే గోపాలమిత్రల సమస్యలన్నీ పరిష్కరిస్తామని 2018 జనవరి 13వ తేదీన చిత్తూరు జిల్లాలో జరిగిన ప్రజా సంకల్పయాత్రలో నాడు ప్రతిపక్ష నేతగా వున్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. దీంతో గోపాలమిత్రలు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. కానీ 2019లో అధికారంలోకి వచ్చి వైసీపీ ప్రభుత్వం మూడు నెలలు మాత్రమే ప్రోత్సాహకాలు చెల్లించింది. ఆ తరువాత నుంచి చెల్లించడం లేదు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా, ప్రోత్సాహక బకాయిలు అడిగితే ఉద్యోగాల నుంచి తొలగిస్తామంటూ ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారని వారు వాపోతున్నారు. కాగా ఆరు నెలల నుంచి గౌరవ వేతనం కూడా ఇవ్వడంలేదని అంటున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో కృత్రిమ గర్భధారణ ప్రోత్సాహ నగదు సుమారు రూ.4 కోట్ల మేర అందాల్సి వుందని వారు చెబుతున్నారు.

# జిల్లాలో కొత్త ఓటర్లు 11,646

**అనకాపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలో కొత్తగా 11,646 మంది ఓటర్లు చేరనున్నారు. ఈ ఏడాది జనవరి 22న జిల్లా ఎన్నికల అధికారులు ప్రకటించిన తుది ఓటర్ల జాబితా ప్రకారం మొత్తం 15,72,654 మంది ఓటర్లు ఉన్నారు. తుది జాబితా ప్రకటన తరువాత ఎన్నికల కమిషన్ ఈనెల 15వ తేదీనాటికి 18 సంవత్సరాలు నిండిన వారు, ఇప్పటి వరకు ఓటు నమోదు చేసుకోని వారు కొత్తగా ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. దీంతో జిల్లాలో 18,660 దరఖాస్తులు అందాయి. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు 11,646 దరఖాస్తుదారుల పేర్లను ఓటరు జాబితాలో చేర్చాలని నిర్ణయించారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్‌కి నివేదిక పంపారు. అనుమతి రాగానే తుది ఓటర్ల జాబితాలో వీటిని చేర్చనున్నారు. వచ్చే నెలలో జరిగి ఎన్నికల్లో వీరికి కూడా ఓటు వేసే అవకాశం ఉంటుంది. కాగా ఓటర్ల జాబితాల్లో సవరణల కోసం 2,453 దరఖాస్తులు అందగా వీటిని పరిశీలించిన అధికారులు 1,726 దరఖాస్తులను పరిష్కరించారు.

## తుమ్మపాలలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థికి నిరసన సెగ




తుమ్మపాలలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌ను నిలదీస్తున్న మహిళలు

**తుమ్మపాల, ఏప్రిల్ 16 :** వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌కు మంగళవారం తుమ్మపాలలో నిరసన సెగ తగిలింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా తుమ్మపాల గవరపేట వీధిలో నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తుండగా కాలనీలో మహిళలంతా మూకుమ్మడిగా తిరగబడ్డారు. ఎన్నికల సమయంలో మాత్రమే తాము గుర్తుకు వస్తామని, మిగిలిన సమయాల్లో మా సమస్యలు ఎవరికీ పట్టవని నిలదీశారు. గతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కూడా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి పరిష్కారం కాలేదని మండిపడ్డారు. బూటకపు హామీలతో వైసీపీ నాయకులంతా తమ ప్రాంత వాసులను మోసగిస్తున్నారని ఆరోపించారు. కాలనీలో సరైన డ్రైనేజి వ్యవస్థ గాని, రోడ్లు గాని, పారిశుధ్యం గాని, తాగునీటి సదుపాయం గాని లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలు సందర్భాల్లో అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యలు తీసుకువచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పుడు ఓట్లు దండుకునేందుకు ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారని ప్రశ్నించారు. దీంతో నిర్ఘాంతపోయిన భరత్‌కుమార్ ఈ దఫా ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని సర్ది చెప్పి, అక్కడ నుంచి వెళ్లిపోయారు.

## వైసీపీ పాలనలో అంధకారంలో గ్రామాలు

▸▸ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ



మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

**తుమ్మపాల, ఏప్రిల్ 16 :** ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాలన్నీ అంధకారమయ్యాయని జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కూండ్రం, ఆర్‌వీ పాలెం, కుంచంగి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి స్థానికులతో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. వైసీపీ పాలనలో నాయకులు అంతులేని అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ప్రకటనలకే తప్ప అనకాపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి జాడ లేదని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద, సీఎం రిత్విక్ పాల్గొన్నారు.

## టీడీపీలో చేరిన బుచ్చిరాజుపేట సర్పంచ్ శ్రీను



అనిత సమక్షంలో టీడీపీలో చేరిన కాళ్ల శ్రీను

**నక్కపల్లి, ఏప్రిల్ 16:** మండలంలోని బుచ్చిరాజుపేట సర్పంచ్ కాళ్ల శ్రీను టీడీపీలో చేరారు. మంగళవారం రాత్రి గ్రామంలో నిర్వహించిన ప్రజాగళం సభలో సర్పంచ్ శ్రీను, ఆయన అనుచరులకు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, కొప్పిశెట్టి బుజ్జి, కురందాసు నూకరాజు, దేవర సత్యనారాయణ, గింజాల లక్ష్మణరావు,బీజేపీ నాయకులు కోసూరి శ్రీను, పోలినాటి నానాజీ పాల్గొన్నారు.

## నాపై ఆరోపణలు తగదు : ఎంపీ సత్యవతి

**అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16 :** నాపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదని ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. మార్కెట్ యార్డులోని స్థలాలు కబ్జా చేయడానికి వైసీపీ రీజనల్ ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డితో తాను వెళ్లానని మాజీ మంత్రి వీరభద్రరావు ఆరోపించడం మంచి పద్ధతి కాదన్నారు. ఎమ్మెల్యేగా అమర్‌నాథ్‌ను, ఎంపీగా తనను గెలిపించానని ఆయన చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

## బ్రాండిక్స్ వద్ద కాలిన 220 కేవీ ట్రాన్స్‌ఫార్మర్

**అచ్యుతాపురం, ఏప్రిల్ 16:** సాంకేతిక లోపం కారణంగా మంగళవారం రాత్రి సెజ్‌లోని బ్రాండిక్స్ కర్మాగారం వద్ద 220 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దీంతో అచ్యుతాపురం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో గల గ్రామాలు, కర్మాగారాల్లో రాత్రి ఏడు నుంచి రాత్రి పంది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సాంకేతిక కారణాల వల్ల కాలిపోయిందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

## వ్యాపారిపై చీటింగ్ కేసు నమోదు

**అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16:** ఒక ప్రముఖ కంపెనీ పేరుతో నకిలీ గ్యాస్ స్టౌలను విక్రయిస్తున్న వ్యాపారిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ అలీ తెలిపారు. ఆయన వెల్లడించని వివరాల ప్రకారం... స్థానిక చిన్నవీధిలోని ఒక దుకాణంలో బట్టర్ ఫ్లై కంపెనీకి చెందిన దినేశ్ శివరామ్‌శెట్టితో పాటు మరొకరు 15 రోజుల క్రితం రెండు గ్యాస్ స్టౌలు కొనుగోలు చేశారు. వీటిని ముంబైకిలోని కంపెనీకి పంపించి పరిశీలన చేయించగా నకిలీవని నిర్ధారణ అయింది. దీంతో దినేశ్‌శివరామ్‌శెట్టి ఫిర్యాదు మేరకు దుకాణప్రతినిధిపై చీటింగ్ కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

# నిప్పుల కొలిమి

▸▸ అధిక ఉష్ణోగ్రతతో అల్లాడిన ప్రజలు

▸▸ బయటకు వచ్చేందుకు భయపడిన జనం



నిర్మానుష్యంగా ఉన్న పరవాడ ప్రధాన రహదారి

**అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16 :** జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో మంగళవారం భానుడి ప్రతాపానికి ప్రజలు అల్లాడిపోయారు. ఒక పక్క ఉష్ణోగ్రత, మరో పక్క వడగాడ్పులతో పట్టణ ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. మంగళవారం అత్యధిక ఉష్ణోగ్రత 42.7, డిగ్రీల నమోదైంది. ఈ ఏడాది ఈ వేసవిలో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత. ఉదయం నుంచి వాతావరణం వేడెక్కుతూ రావడమే కాకుండా పదిన్నర గంటల నుంచి వడగాడ్పులు ప్రారంభమై సాయంత్రం నాలుగు గంటలు దాటినా ఆగలేదు. అడపాదడపా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినప్పుడు ప్రజలు ఇటు ఇళ్లల్లోను, అటు దుకాణాల్లోను అవస్థలు పడక తప్పలేదు. వడగాడ్పుల కారణంగా పట్టణ ప్రజలు ఇళ్లల్లోంచి బయటకు రావడానికి సాహసించలేదు. ప్రజలు దాహం తీర్చుకోవడానికి శీతలపానీయాల దుకాణాల వైపు పయనించారు.

**పరవాడలో..** ఎండల తీవ్రత కొనసాగుతూనే ఉంది. మూడు రోజులుగా ఎండలు మండుతున్నది. ఉదయం తొమ్మిది గంటల నుంచి వేడిగాడ్పులతోపాటు ఎండ తీవ్రత ప్రారంభమైంది. 11 గంటలకల్లా అధికంగా వడగాడ్పులు వీయడంతో ప్రధాన రహదారులన్నీ బోసిపోయాయి. నిత్యం రద్దీగా ఉండే పరవాడ ప్రధాన రహదారి జనసంచారం లేక నిర్మానుష్యంగా మారింది. ఎండ కారణంగా పరవాడ వారపుసంత వెలవెలబోయింది.

**సబ్బవరంలో..** సబ్బవరంలో మంగళవారం ఎండ తీవ్రత నిప్పుల కొలిమిని తలపించింది. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత విపరీతంగా పెరిగిపోయింది. దానికితోడు తీవ్ర వడగాడ్పులు వీయడంతో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వృద్ధులు, చంటి పిల్లలు ఎండల తీవ్రతకు అల్లాడిపోయారు. భానుడి ప్రతాపానికి ఉదయం 10 గంటలకే మండల కేంద్రంలో జన సంచారం లేదు.

**ఎలమంచిలిలో..** ఎలమంచిలిలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచే పగటి ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగాయి. వేడి గాలులు వీయడంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మంగళవారం పట్టణంలో ఎండ ఉష్ణోగ్రతకు జనంతో రద్దీగా ఉండే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఎండవేడిమి తట్టుకోలేక జనం ఇళ్లకే పరిమితం అయ్యారు. దీంతో వ్యాపార సముదాయాలు, ప్రధాన రహదారులు జన సంచారం లేక నిర్మానుష్యంగా మారాయి.

## కూటమి అభ్యర్థులకు మద్దతుగా సుందరపు కుటుంబ సభ్యుల ప్రచారం



ఎలమంచిలి గాంధీనగర్‌లో కూటమి అభ్యర్థుల విజయం కోరుతూ ప్రచారం చేస్తున్న సుందరపు సతీమణి శైలజ



పాత ఎస్‌బీఐకాలనీలో కూటమి అభ్యర్థుల విజయం కోరుతూ ప్రచారం చేస్తున్న సుందరపు వదిన దమయంతి

**ఎలమంచిలి, ఏప్రిల్ 16:** జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్, అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌ల విజయం కోరుతూ సుందరపు కుటుంబ సభ్యులు ఇంటింటా ప్రచారం చేశారు. మంగళవారం పట్టణంలోని గాంధీనగర్ ప్రాంతంలో పాత ఎస్‌బీఐ కాలనీ, రెహబోతు చర్చి, మధురానగర్ ప్రాంతాల్లో జనసేన ఉత్తరాంధ్ర ముఖ్య వ్యవహారాల ప్రతినిధి సుందరపు సతీష్ కుమార్, తనదైన శైలిలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. సుందరపు విజయకుమార్ సతీమణి శైలజ, వదిన దమయంతి, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలతో కలిసి కూటమి పార్టీల పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థుల విజయం కోరుతూ ప్రచారం నిర్వహించారు. అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్‌కు కమలం గుర్తు, ఎలమంచిలి జనసేన అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్‌గుర్తు గాజుగ్లాస్‌పై ఓటు వేసి గెలిపించాలని కోరారు. సుందరపు సతీమణి, వదిన ఇంటింటికి వెళ్లి మహిళలకు బొట్టు పెట్టి ఓటును అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కొఠారు సాంబ, గొర్లె నానాజీ, జనసేన నేతలు బొద్దపు శ్రీను, కొఠారు నరేష్, ఊడి బాబులు, బీజేపీ నేతలు నక్కాశివశంకర్, పప్పు ఈశ్వరరావు పాల్గొన్నారు.

## చెక్‌పోస్టుల్లో ముమ్మర తనిఖీలు : ఎస్పీ

**అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 16:** చెక్ పోస్టులు, డైనమిక్ చెక్‌పోస్టుల్లో ముమ్మర తనిఖీలు చేయాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నెల వారి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా డబ్బు, మద్యం, ఉచిత కానుకల రవాణాకు అడ్డుకట్టవేయాలన్నారు. రాజకీయ నాయకుల ఎన్నికల బహిరంగ సభల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ సందర్భంగా ఎన్నికల నియమావళి ప్రకారం బందోబస్తు ఏర్పాట్లు చేయాలని, అభ్యర్థులకు సంబంధించి మూడు వాహనాలు మాత్రమే నామినేషన్ సమయంలో రిటర్నింగ్ కార్యాలయానికి అనుమతించాలన్నారు. అభ్యర్థితో సహ ఐదుగురిని మాత్రమే ఆర్‌వో చాంబర్‌లోకి అనుమతించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఏఎస్పీ విజయభాస్కర్, డీఎస్పీ సత్యనారాయణ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## కూటమి అభ్యర్థుల గెలుపునకు సహకరించండి : సీఎం రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రమేశ్

**అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16:** రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయానికి సహకరించాలని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ కోరారు. మంగళవారం కొణతాల సుబ్రహ్మణ్యం కల్యాణ మండపంలో యాదవ సామాజిక వర్గీయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటు అభివృద్ధి పనులు, అటు సంక్షేమ పథకాలకు సమాన ప్రాధాన్యం ఇస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, ఇందుకు కూటమి కట్టుబడి వుందని అన్నారు. అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు. జనసేన పార్టీ అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, ఎన్నికల అనంతరం రాష్ట్రంతోపాటు కేంద్రంలో కూడా ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తుందని పేర్కొన్నారు. యాదవ సామాజిక వర్గీయులంతా కూటమి అభ్యర్థుల గెలుపునకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, యాదవ సంక్షేమ సంఘం ప్రతినిధులు భరణికాన బాబురావు, భరణికాన నరసింహమూర్తి, సబ్బి శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**కూటమి విజయం తథ్యం**

**సబ్బవరం:** రాష్ట్రంలో కూటమి విజయం తథ్యమని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అన్నారు. మంగళవారం మొగలిపురంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు గండి బాబ్జీ స్వగృహం వద్ద టీడీపీ, బీజేపీ, జనసేన ముఖ్య నేతలు, కార్యకర్తలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీ మాజీ సభ్యులు, మాజీ సర్పంచుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణులను ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు పరిచయం చేశారు. అనంతరం ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ మాట్లాడుతూ.. నేరాలు,ఘోరాలు చేసిన వ్యక్తులు మనకు నాయకులుగా చెలామణీ అవుతున్నారన్నారు. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ అని చెప్పుకుంటూ ఊరూరా తిరుగుతున్న సీఎం ఉత్తరాంధ్రతో సహా రాష్ట్రాన్ని రెడ్ల చేతిలో పెట్టడం నిజం కాదా అని ప్రశ్నించారు. ఓట్ల కోసం కొత్తగా గులకరాయి డ్రామా మొదలు పెట్టారని, అది పక్కా డ్రామా అని ప్రజలకు తెలిసిపోయిందన్నారు. ఇక్కడ ఎంపీ, ఎమ్మెల్యే రెండూ మనవేనన్నారు. జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ.. పెందుర్తి నియోజకవర్గంలోని కూటమి కార్యకర్తలు, నేతలను తన గుండెల్లో పెట్టుకుంటానన్నారు. బాబ్జీని కాదని, తాము ఏమీ చేయబోమన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు భరణికాన బాబూరావు, బంగారునాయుడు, పైల జగన్నాథరావు, గండి దేముడు, ముత్యాలనాయుడు, ఎం.మహాలక్ష్మీనాయుడు, బొండా సత్యారావు, గండి వంశీ, బీఏ రావు, బంతికోళ్ల పద్మ పాల్గొన్నారు

## గ్రామాన్ని తరలిస్తేనే ఎన్నికల్లో పాల్గొంటాం

▸▸ పెందుర్తి ఆర్‌ఓకు తేల్చి చెప్పిన తాడి గ్రామస్థులు



తాడి గ్రామస్థులతో సమావేశమైన పెందుర్తి ఆర్‌వో శేషశైలజ

**పరవాడ, ఏప్రిల్ 16:** వచ్చే నెలలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ను బహిష్కరించే విషయంలో తాము వెనక్కు తగ్గేది లేదని మండలంలోని తాడి గ్రామస్థులు పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి శేషశైలజకు తేల్చి చెప్పారు. ఫార్మా కాలుష్య కోరల్లో చిక్కుకున్న తమ గ్రామాన్ని తరలించడంలో ప్రభుత్వం, అధికారులు పూర్తిగా విఫలమయ్యారని, ఇందుకు నిరసనగా ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టు తాడి గ్రామస్థులు ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మంగళవారం తాడి గ్రామంలో ఆమె 'సీప్' సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాలుష్య సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని, సార్వత్రిక ఎన్నికలకు సహకరించాలని కోరారు. దీంతో పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ, తమ సమస్యను గతంలోనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని, మీరు మరోసారి తీసుకువెళ్లాల్సిన అవసరం లేదని అన్నారు. గ్రామాన్ని తరలిస్తామని లిఖితపూర్వకంగా హామీ ఇస్తేనే ఎన్నికల్లో పాల్గొంటామని స్పష్టం చేశారు. రిటర్నింగ్ అధికారిణి శేషశైలజ ప్రతిస్పందిస్తూ.. గ్రామ తరలింపునకు ఎలాంటి హామీ ఇవ్వలేనని, మరోసారి ఆలోచించుకుని ఎన్నికల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ మాదంశెట్టి నీలబాబు, మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు, నాయకులు కోమటి అచ్చిబాబు, కోమటి సూరిబాబు, గనిరెడ్డి కనకారావు, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ బాలసూర్యారావు, తహసీల్దార్ గణపతిరావు, ఎంపీడీవో కీర్తిస్పందన, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎన్టీపీసీ కాలుష్యంతో ఎన్నో సమస్యలు

▸▸ మూలస్వయంభూవరం గ్రామాన్ని తరలించాల్సిందే

**పరవాడ, ఏప్రిల్ 16:** సింహాద్రి ఎన్టీపీసీ కాలుష్యం బారిన పడిన తమ గ్రామాన్ని తరలించాలని మూలస్వయంభూవరం ప్రజలు మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ఎన్టీపీసీ నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళి కారణంగా రోగాలబారిన పడుతున్నామన్నారు. నీటి వనరులు కలుషితమయ్యాయని, తాగు నీటిని కొనుక్కోవాల్సి వస్తున్నదని, పంటలు పాడేపోతున్నాయని, పశువులు మృత్యువాత పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పలువురు ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, నేత్ర సంబంధ సమస్యలతో బాధపడుతున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి బాబురావు, భానుప్రసాద్, కె.లక్ష్మి, అప్పలనాయుడు, గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## లోవపాలెంలో టీడీపీ ప్రచారం

**రాంబిల్లి, ఏప్రిల్ 16 :** ఎన్నికల్లో అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, ఎలమంచిలి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్‌లను గెలిపించాలంటూ మండలంలోని జడ్.చింతువా పంచాయతీ లోవపాలెంలో తెలుగుయువత మండల అధ్యక్షుడు ఎరిపల్లి అజయ్, మాజీ సర్పంచ్ ఎరిపల్లి చిట్టిబాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు చెల్లూరి ఆనంద్ టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి మంగళవారం ఇంటింటా ప్రచారం చేశారు. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తే చంద్రబాబునాయుడుముఖ్యమంత్రి అయితే రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. లోవపాలెంలోని పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు.

## వెన్నెలపాలెంలో పట్టపగలు చోరీ

**పరవాడ, ఏప్రిల్ 16:** మండలంలోని వెన్నెలపాలెం పంచాయతీ బీసీ కాలనీలో మంగళవారం పట్టపగలు దొంగతనం జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు ప్రవేశించి బీరువాలో ఉన్న 8.25 తులాల బంగారం ఆభరణాలు ఎత్తుకెళ్లిపోయారు. ఈ సంఘటనకు సంబంధించి సీఐ బాల సూర్యారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బీసీ కాలనీకి చెందిన చుక్క రమాదేవి, అత్త పైడమ్మతో కలిసి నివాసం ఉంటున్నారు. పైడమ్మ ఉదయాన్నే బజారుకు వెళ్లిపోగా రమాదేవి ఎన్టీపీసీలో కూలీ పనికి వెళ్లింది. పైడమ్మ మధ్యాహ్నం 12 గంటలకు ఇంటికి వచ్చేసరికి ప్రధాన ద్వారం తెరిచి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బెడ్‌రూమ్‌లోని బీరువా తెరిచి వుంది. ఇందులో భద్రపరిచిన 8.25 తులాల బంగారం ఆభరణాలు చోరీకి గురైనట్టు గుర్తించింది.విషయాన్ని రమాదేవికి ఫోన్ ద్వారా తెలియజేసింది. సాయంత్రం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. సీఐ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్లూస్‌టీమ్ వచ్చి వివరాలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

## అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తాం..

... 3వ పేజీ తరువాయి

మార్కెటింగ్ సదుపాయం లేదు. జిల్లాలో కనీసం ఒక్క రైతు బజారు కూడా లేకపోవడం శోచనీయం. ఇటువంటి చిన్నచిన్న సమస్యలను కూడా వైసీపీ ప్రభుత్వం పరిష్కరించలేదు. రైతులు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలను పరిష్కరించేందుకు అన్నివిధాలా ప్రయత్నిస్తా. షుగర్ ఫ్యాక్టరీలు మూతపడ్డాయని దీనివల్ల తాము నష్టపోయామని పాయకరావుపేట, నర్సీపట్నం, అనకాపల్లి, ఎలమంచిలి నియోజకవర్గాలకు చెందిన చెరకు రైతులు చెప్పారు. మూతపడిన సహకార చక్కెర పరిశ్రమలను తెరిపించేందుకు కృషి చేయడమే కాకుండా వీటికి అనుబంధంగా ఇథనాల్ ఉత్పత్తి యూనిట్లను ఏర్పాటు చేయించేందుకు కచ్చితంగా ప్రయత్నిస్తాను.

**సముద్ర తీరప్రాంతాల్లో గ్రీన్‌హైడ్రోజన్ ప్లాంట్లు**

జిల్లాలో 72 కిలోమీటర్ల పొడవున సముద్ర తీర ప్రాంతం ఉంది. ఎలమంచిలి, పాయకరావుపేట నియోకవర్గాల్లోని తీర ప్రాంతాల్లో గ్రీన్‌హైడ్రోజ్ పవర్ ప్లాంట్‌ల ఏర్పాటు ద్వారా సోలార్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తికి అవకాశాలు మెండుగా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం సోలార్ ఎనర్జీ అభివృద్ధిలో భాగంగా ఇచ్చే రాయితీలు వర్తింపజేసి గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్‌లను ఏర్పాటుచేయిస్తాం. దీనివల్ల స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

**ప్రజల నుంచి విశేష స్పందన....**

ప్రధాని మోదీ ఆదేశిస్తేనే అనకాపల్లిలో పోటీ చేయడానికి వచ్చాను. ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో చేయాల్సి ఉంది. గ్రామాల్లో పర్యటిస్తున్నప్పుడు ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ, ఆప్యాయతలను మరవలేను. ఎక్కడికి వెళ్లినా తమ కుటుంబ సభ్యుడిగా భావిస్తూ, స్వాగతం పలకడం ఆనందంగా ఉంది. తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, శ్రేణులు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు. అధికార పార్టీ నేతలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎన్ని కుయుక్తులు పన్నినా... వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీ స్థానంతోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీలతో జయకేతనం ఎగురవేయడం ఖాయం.

## బండారు, దాడిలను కలిసిన బత్తుల



బత్తుల తాతయ్యబాబును సత్కరించిన దాడి రత్నాకర్

**పరవాడ / అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16 :** తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తిను టీడీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాతయ్యబాబు వెన్నెలపాలెంలోని బండారును తన స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనకాపల్లి లక్ష్మీనారాయణనగర్‌లోని డీవీఆర్ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్‌ను మర్యాదపూర్వకంగా బత్తుల తాతయ్యబాబు కలిశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు సత్కరించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లాలం కాశీనాయుడు, బొలిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## 'కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి'

**అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16 :** కాంగ్రెస్ పార్టీ ద్వారానే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి ఐఆర్ గంగాధర్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ మేనిఫెస్టో కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి యేటా ప్రతి కుటుంబంలో ఒక మహిళకు రూ.లక్ష చొప్పున మహాలక్ష్మి పథకం కింద అందజేస్తామన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు దాసరి సంతోష్‌కుమార్, కశింకోట మండల పార్టీ అధ్యక్షుడు ఎస్. గజ్జాలు, డీసీసీ కార్యదర్శి ఎగ్గాడ భాస్కరరావు పాల్గొన్నారు.

## డైట్‌లో రీసెర్చ్ పుస్తకావిష్కరణ

**అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16 :** స్థానిక డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్ట్స్ ఆన్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ రీసెర్చ్ -2024 పుస్తకాన్ని కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది 83 మంది విద్యార్థుల పరిశోధనలను అంతర్జాతీయ ఐఈఈఈ కాన్ఫరెన్స్‌లో పబ్లిష్ అయ్యేలా కృషి చేసినందుకు కళాశాల ఆర్‌అండ్‌డీ సమన్వయకర్త డాక్టర్ ఎస్.రమణకుమార్ జోగాను ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఎఎస్ గోపాలంను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, అకాడమిక్ కో-ఆర్డినేటర్ కృష్ణనాగ్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## వలంటీర్లతో వైసీపీ నేతల సమావేశం

**కోటవురట్ల, ఏప్రిల్ 16:** వలంటీర్ల పోస్టులకు రాజీనామాలు చేసినా వారితో వైసీపీ పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, ఎంఎస్ఎంఈ చైర్మన్ డీవీ సూర్యనారాయణరాజు మంగళవారం తంగేడులో సమావేశమయ్యారు. మండలంలో 19 సచివాలయాల్లో పనిచేస్తున్న 317 మంది రాజీనామా చేసిన వలంటీర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో వైసీపీ నేతలు సాగి సీతబాబు, పైల రమేష్, సర్పంచులు పాల్గొన్నారు.

## ఇన్‌చార్జి జడ్సీగా రామ్మోహన్

**అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16:** జీవీఎంసీ అనకాపల్లి జోనల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా సూపరింటెండెంట్ ఇంజినీర్ రామ్మోహన్ మంగళవారం నియమితులయ్యారు. జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడుకు అనారోగ్యం కారణంగా సెలవులో ఉండడంతో ఇన్‌చార్జిగా రామ్మోహన్‌ను నియమించినట్టు జీవీఎంసీ వర్గాలు తెలిపాయి.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16 :** విద్యుత్ నిర్వహణ పనుల్లో భాగంగా బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ ఈఈ కె. రాజశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాగి సుబ్బరాజువీధి, గౌరీ సంఘం వీధి, సతకంపట్టు ప్రాంతం, మహిళా కళాశాల, దిబ్బవీధి, రైతు సంఘం ఏరియా, దాడి భోగలింగంనాయుడు వీధి, గంగిరేవిచెట్టు, అరుంధతినగర్ ప్రాంతాల్లో బుధవారం మధ్యాహ్నం మూడున్నర గంటల నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## పాలిసెట్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

**ఎస్. రాయవరం, ఏప్రిల్ 16:** మండలంలోని పెదగుమ్ములూరు జడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు మంగళవారం పీఆర్‌టీయూ ప్రతినిధులు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, కార్యదర్శి శ్రీనివాసరావు, సమన్వయకర్త సత్యనారాయణ, శామ్యూల్‌రాజ్ పాల్గొన్నారు.


## హార్బర్ పనుల వద్ద బాధితుల ఆందోళన

**అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 16 :** పూడిమడక శివారు పెద్దూరు పరిధిలో తమ భూమిలో అక్రమంగా గ్రావెల్ తవ్వడంపై మత్స్యకారుడు చేపల తాతయ్య కుటుంబీకులు మంగళవారం ఆందోళనకు దిగారు. పెద్దూరులో 134-2, 135 సర్వే నంబర్లలో 40 ఏళ్ల నుంచి తమ ఆక్రమణలో ఉన్న 70 సెంట్ల భూమిని ఫిషింగ్ హార్బర్ కోసం తీసుకున్నారని తెలిపారు. సదరు భూమిలో ఉన్న తాటిచెట్లు, జీడిచెట్లు, సరుగుడు తోటను రెండు నెలల క్రితం తమకు నోటీసులు ఇవ్వకుండా.. సమాచారం లేకుండా అర్ధరాత్రి పూట ప్రైవేటు వ్యక్తులు ఎక్స్‌కవేటర్లతో తొలగించారన్నారు. తమకు కనీసం నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. ఇదే విషయమై గత నెల 2న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. మంగళవారం చేపల తాతయ్య కుటుంబ సభ్యులు అక్రమ గ్రావెల్ వద్ద ఆందోళన చేశారు. కలెక్టర్ స్పందించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని వారు కోరారు.

## పందూరులో మద్యం స్వాధీనం

**కోటవురట్ల, ఏప్రిల్ 16:** మండలంలోని పందూరులో బెల్టు షాపుపై దాడిచేసి 42 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. పందూరు గ్రామానికి చెందిన బత్తుల నాగవెంకట సన్యాసిశెట్టి తన ఇంటిలో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్టు గుర్తుతెలియని వ్యక్తిఇచ్చిన సమాచారం మేరకు మంగళవారం దాడి చేశామన్నారు. 42 మద్యం క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నామని, ప్రభుత్వ ధరల ప్రకారం వీటి విలువ సుమారు రూ.7 వేలు వుంటుందని ఎస్‌ఐ చెప్పారు. నిందితుడిపై కేసు నమోదుచేసి అరెస్టు చేశామని ఎస్‌ఐ రమణయ్య తెలిపారు.

## సీఎం రమేశ్‌ను కలిసిన వంగవీటి రాధ



బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌తో మాట్లాడుతున్న వంగవీటి రాధ

**అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16:** అనకాపల్లి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి సీఎం రమేశ్‌ను వంగవీటి రంగా తనయుడు వంగవీటి రాధ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం సాయంత్రం స్థానిక జాతీయ రహదారి పక్కనున్న బీజేపీ కార్యాలయానికి వచ్చిన వంగ వీటి రాధకు, బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన సీఎం రమేశ్‌ను కలిసి పలు విషయాలపై మాట్లాడారు.

## తాగునీటి సమస్య పరిష్కరించాలి

▸▸ ఎంపీపీ ఇసరపు పార్వతి

**పాయకరావుపేట, ఏప్రిల్ 16 :** వేసవికాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఇసరపు పార్వతి అధికారులను కోరారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ హాల్లో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి వనరులకు త్వరితగతిన మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరాలో సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో పాడైన బోర్లు, పైపులైన్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యులు లంక సూరిబాబు, మండల పరిషత్ కార్యాలయ ఏఓ వర్మ, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలకు సరకులన్నీ ఒకేసారి పంపిణీ చేయాలి

▸ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగశేషు డిమాండ్

**అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16:** అంగన్‌వాడీ కేంద్రాలకు సరకులకు సకాలంలో, సక్రమంగా పంపిణీ చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగశేషు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు ఇవ్వాల్సిన టేక్ హోమ్ రేషన్‌కు సంబంధించి అన్ని రకాల సరకులను ఒకేసారి కేంద్రాలకు పంపిణీ చేయడం లేదని, లబ్ధిదారులకు అన్ని సరకులు ఒకేసారి ఇస్తేనే ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లో నమోదు అవుతుందని చెప్పారు. కానీ సరకులు ఇవ్వకుండానే.. ఇచ్చినట్టుగా యాప్‌లో నమోదు చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. టీచర్, ఆయాలు ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కేంద్రంలోనే ఉండాలన్న అధికారుల ఆదేశాలపై ఆందోళన నిర్వహిస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి వివిధ యాప్‌లను ఒకే యాప్‌గా మారుస్తామని సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి, సభ్యులు వీవీ రమణమ్మ, కె.రామలక్ష్మి, తనూజ, ఉమా నారాయణమ్మ పాల్గొన్నారు.

# పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం

▸ కొండపాలెం- కడపాలెం మధ్య అసంపూర్తిగా డ్రైనేజీ కాలువల నిర్మాణం

▸ మురుగునీరు నిలిచిపోయి దోమల బెడద, దుర్వాసన ▸ రహదారిని మూసివేసి మత్స్యకారుల నిరసన

**అచ్యుతాపురం, ఏప్రిల్ 16:** పూడిమడక పంచాయతీ శివారు కొండపాలెం నుంచి కడపాలెం వరకు ఇళ్ల ముందు డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో మురుగు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నది. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో ఆగ్రహించిన మత్స్యకారులు రహదారిని మూసివేశారు. వివరాల్లోకి వెళితే..

పూడిమడక శివారు కొండపాలెం నుంచి కడపాలెం వరకు డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులను పంచాయతీ అధికారులు చేపట్టారు. అయితే కొండపాలెంలో పుక్కళ్ల సత్యారావు, చోడిపల్లి దేముడు ఇళ్ల వరకు కాలువలు నిర్మించి మిగతాభాగం వదిలేశారు. దీంతో ఎగువున వున్న ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరంతా వీరి ఇళ్ల వద్ద నిలిచిపోతున్నది. తీవ్ర దుర్వాసనతోపాటు దోమల బెడద పెరిగిపోయింది. అంతేకాకుండా మురు గునీరు నిల్వ ఉన్న చోట భూమి కుంగిపోయి ఇంటి గోడలు బీటలు వారాయి. ఈ సమస్యను పంచాయతీ అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. అధికారుల తీరును నిరసిస్తూ మత్స్యకారులు తమ ఇళ్ల వద్ద రోడ్డును మూసివేశారు. దీంతో కొండపాలెం, కడపాలెం మధ్య పాదచారులు తప్ప వాహన రాకపోకలు నిలిచిపోయాయి. కొండపాలెం, కడపాలెం వాసులు పూడిమడక రావాలన్నా, అచ్యుతాపురం వెళ్లాలన్నా కడపాలెం శివారు బాపనమ్మ ఆలయం మీదుగా రెండు కిలోమీటర్ల మేర చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తున్నది. అయినాసరే పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదు.


కొండపాలెంలో మూసివేసిన రోడు

## వలస కార్మికుడికి పరిహారం ఇవ్వాలి

**అచ్యుతాపురం, ఏప్రిల్ 16:** రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పిడిలైట్ కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికుడికి పరిహారం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం బంకుర గ్రామానికి చెందిన అఖిల్ బౌరీ (49) కంటైనర్ ఢీకొనడంతో సోమవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి కంటైనర్ యజమానితో పాటు కంట్రాక్టర్, పిడిలైట్ కర్మాగారం యాజమాన్యం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఆయన కోరారు.

## నర్సీపట్నం నియోజకవర్గం

### ముత్యాలపాపకు టీడీపీ నేతల అభినందనలు



ముత్యాలపాపకు అభినందనలు తెలియజేస్తున్న నాతవరం మండల టీడీపీ నాయకులు

**నాతవరం, ఏప్రిల్ 16 :** రాష్ట్ర టీడీపీ కార్యదర్శిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే బోళెం ముత్యాల పాప, ఆమె భర్త బోళెం వెంకటరమణమూర్తిలను మంగళవారం టీడీపీ మండల నాయకులు అభినందనులు తెలియజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికలల్లో అయ్యన్నపాత్రుడు విజయానికి ముత్యాలపాప, వెంకటరమణమూర్తి దంపతులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎన్. విజయ్‌కుమార్, పారుపల్లి కొండబాబు, అప్పన్న దివాణం, శెట్టి సత్యనారాయణ, జీరెడ్డి రాజుబాబు, ఇటంశెట్టి సీతారామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### వేతనాల కోసం ప్రాంతీయ ఆస్పత్రి శానిటేషన్ సిబ్బంది ధర్నా



ధర్నా చేస్తున్న ఏరియా ఆస్పత్రి శానిటేషన్ సిబ్బంది

**నర్సీపట్నం, ఏప్రిల్ 16 :** వేతన బకాయిల కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో ఏరియా ఆస్పత్రి పారిశుద్య సిబ్బంది మంగళవారం ఆస్పత్రి ఆవరణలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు అడిగర్ల రాజు మాట్లాడుతూ ఏరియాస్పత్రిలో పని చేస్తున్న పారిశుద్య సిబ్బందికి నాలుగు నెలలుగా వేతనాలు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వేతనాలు లేక ఆర్థాకలితో అలమటిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వేతన బకాయిలు తక్షణమే విడుదల చేసి, ప్రతీ నెలా ఒకటో తేదీకి వేతనాలు ఇచ్చే విధంగా సూపరింటెండెంట్ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఠారెత్తించిన ఎండ

- రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు
- బయటకు వచ్చేందుకు భయపడుతున్న జనం
- బోసిపోయిన రహదారులు



నర్సీపట్నంలో ఎండ తీవ్రతకు తలపై తువ్వాలు, చీరకొంగు వేసుకొని వెళుతున్న దృశ్యం



ఎండతో నిర్మానుష్యంగా మారిన ఏఎల్‌పురం రహదారి

**నర్సీపట్నం, ఏప్రిల్ 16:** మండుతున్న ఎండలతో మునిసిపాలిటీ ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మునిసిపాలిటీలోని పెదబొడ్డేపల్లిలో మంగళవారం మధ్యాహ్నం 1 గంట సమయానికి రికార్డు స్థాయిలో 41.8 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదు అయింది. దీంతో ప్రజలు ఇంట్లో ఉక్కపోత.. బయటకొస్తే వేడి సెగలతో అల్లాడిపోయారు. వేడి గాలులతో ప్రజలు పనుల కోసం బయటకు రావాలంటే బెంబేలెత్తిపోయారు. నర్సీపట్నంలో ఉదయం 10 గంటల నుంచే ఎండ తీవ్రత కనిపించింది. వేడి గాలులకు భయపడి మధ్యాహ్నం 12 గంటల తర్వాత రోడ్లు మీద జనసంచారం తగ్గిపోయింది. వివిధ పనుల మీద బయటకు వచ్చే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. బయటకు వచ్చేటప్పుడు ఎండ నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలని, అధిక ఉష్ణోగ్రతలకు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని వారంటున్నారు.

**కృష్ణాదేవి పేటలో..** గొలుగొండ మండలం ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, ఏఎల్‌పురం, లింగంపేట తదితర గ్రామాల్లో ప్రధాన రహదారులు ఎండతో మంగళవారం నిర్మానుష్యంగా మారాయి. వేసవిలో ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే కృష్ణాదేవిపేట మెయిన్‌రోడ్డు మంగళవారం బోసిపోయింది. వేసవి ఎండ తీవ్రతతో రోడ్డుపైకి ప్రజలు, ప్రయాణికులు రావాలంటే భీతిల్లుతున్నారు. ఉదయం 8గంటలు మొదలుకొని సాయంత్రం 5 గంటలు వరకు ఎండ తీవ్రత తగ్గడం లేదు.

## లచ్చన్నపాలెంలో ఏడాదిగా ప్రారంభంగాని జలజీవన్ పనులు

- తాగునీటికి ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు

**మాకవరపాలెం, ఏప్రిల్ 16:** మండలంలోని లచ్చన్నపాలెంలో ఏడాది కాలంగా జలజీవన్ మిషన్ పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఆ గ్రామ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామంలో జలజీవన్ మిషన్ పనుల కోసం ఏడాది క్రితం రూ.22 లక్షలు మంజూరయ్యాయి. వెంటనే సచివాలయం వద్ద పైపులను వేశారు. కానీ పనులు మాత్రం నేటికీ ప్రారంభించలేదు. వేసవిలో ప్రస్తుతం ఉన్న తాగునీటి బోర్లు నుంచి తాగునీరు అంతంతమాత్రంగానే వస్తున్నాయని, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. అప్పట్లో వైసీపీ నాయకులు భూమి పూజ కూడా చేశారు. నీటి పథకంతోపాటు ఇంటింటి కొళాయిలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కానీ ఇంతవరకు నీటి పథకంగానీ, కొళాయిలు గానీ ఏర్పాటు చేయలేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జలజీవన్ మిషన్ పనులు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.



లచ్చన్నపాలెం సచివాలయం వద్ద ఏడాదిగా ఉన్న జలజీవన్ పైపులు



గురుకుల విద్యార్థులకు కరపత్రాలు ఆవిష్కరించిన అగ్నిమాపక అధికారి

### అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన ఉండాలి

**నర్సీపట్నం, ఏప్రిల్ 16:** అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని స్థానిక అగ్ని మాపక అధికారి అప్పలస్వామి అన్నారు. మంగళవారం అంబేద్కర్ గురుకుల పాఠశాలలో అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా అగ్ని ప్రమాదాలు, విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మాడిన జీడిమామిడి పూత

- కాపు లేక తీవ్రంగా నష్టపోయిన రైతులు



పప్పుశెట్టిపాలెంలో పూత మాడిపోయిన జీడిమామిడి తోట

**గొలుగొండ, ఏప్రిల్ 16:** ఈ ఏడాది వాతావరణం అనుకూలించకపోవడంతో జీడిమామిడి తోటలకు కాపు లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలో పప్పుశెట్టిపాలెం, కొత్తఎల్లవరం, పాకలపాడు, పుత్తడిగైరంపేట, పాతమల్లంపేట, సాలికమల్లవరం, జిల్లేడపూడి, వెంకటాపురం, కరక, కశిమి, గుండుపాల గ్రామాల్లో మూడు వేల ఎకరాల్లో జీడిమామిడితోటలు ఉన్నాయి. ఈ ఏడాది తోటలకు వచ్చి పూత వచ్చినట్టే మాడిపోయిందని రైతులు తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది పావలా వంతైనా పూత నిలవలేదని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది అధిక దిగుబడులు సాధించుదామని పురుగుమందులు, ఎరువులు జీడిమామిడితోటలకు ఉపయోగించామన్నారు. వేలరూపాయలు పెట్టుబడి పెట్టామని, ప్రస్తుతం జీడిమామిడి పూత మాడిపోవడంతో పెట్టుబడి రాని పరిస్థితులు చోటుచేసుకున్నాయని రైతులు వాపోయారు. బయట అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టామని, పెట్టుబడి రాని పరిస్థితి చోటుచేసుకోవడంతో ఏం చేయాలో దిక్కుతోచడం లేదని రైతులు వాపోతున్నారు.

### అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తాం..

... 3వ పేజీ తరువాయి

మార్కెటింగ్ సదుపాయం లేదు. జిల్లాలో కనీసం ఒక్క రైతు బజారు కూడా లేకపోవడం శోచనీయం. ఇటువంటి చిన్నచిన్న సమస్యలను కూడా వైసీపీ ప్రభుత్వం పరిష్కరించలేదు. రైతులు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలను పరిష్కరించేందుకు అన్నివిధాలా ప్రయత్నిస్తా. షుగర్ ఫ్యాక్టరీలు మూతపడ్డాయని దీనివల్ల తాము నష్టపోయామని పాయకరావుపేట, నర్సీపట్నం, అనకాపల్లి, ఎలమంచిలి నియోజకవర్గాలకు చెందిన చెరకు రైతులు చెప్పారు. మూతపడిన సహకార చక్కెర పరిశ్రమలను తెరిపించేందుకు కృషి చేయడమే కాకుండా వీటికి అనుబంధంగా ఇథనాల్ ఉత్పత్తి యూనిట్లను ఏర్పాటు చేయించేందుకు కచ్చితంగా ప్రయత్నిస్తాను.

**సముద్ర తీరప్రాంతాల్లో గ్రీన్‌హైడ్రోజన్ ప్లాంట్లు**

జిల్లాలో 72 కిలోమీటర్ల పొడవున సముద్ర తీర ప్రాంతం ఉంది. ఎలమంచిలి, పాయకరావుపేట నియోకవర్గాల్లోని తీర ప్రాంతాల్లో గ్రీన్‌హైడ్రోజ్ పవర్ ప్లాంట్‌ల ఏర్పాటు ద్వారా సోలార్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తికి అవకాశాలు మెండుగా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం సోలార్ ఎనర్జీ అభివృద్ధిలో భాగంగా ఇచ్చే రాయితీలు వర్తింపజేసి గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్‌లను ఏర్పాటుచేయిస్తాం. దీనివల్ల స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

**ప్రజల నుంచి విశేష స్పందన....**

ప్రధాని మోదీ ఆదేశిస్తేనే అనకాపల్లిలో పోటీ చేయడానికి వచ్చాను. ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో చేయాల్సి ఉంది. గ్రామాల్లో పర్యటిస్తున్నప్పుడు ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ, ఆప్యాయతలను మరవలేను. ఎక్కడికి వెళ్లినా తమ కుటుంబ సభ్యుడిగా భావిస్తూ, స్వాగతం పలకడం ఆనందంగా ఉంది. తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, శ్రేణులు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు. అధికార పార్టీ నేతలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎన్ని కుయుక్తులు పన్నినా... వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీ స్థానంతోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీలతో జయకేతనం ఎగురవేయడం ఖాయం.

## చోడవరం నియోజకవర్గం

### అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం



ప్రమాద సమయాల్లో జాగ్రత్తలపై అవగాహన దృశ్యం

**చోడవరం, ఏప్రిల్ 16 :** అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండడంతో పాటు ప్రమాద సమయాల్లో చేపట్టాల్సిన జాగ్రత్తలను విద్యార్థులు తెలుసుకోవాలని అగ్నిమాపక శాఖాధికారి బి.వి.రామస్వామి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. అగ్ని, నీరు, గ్యాస్‌పరంగా తలెత్తే ప్రమాదాలు ఇతరత్రా ప్రమాదాల సమయంలో 100, 101, 102, 104 నెంబర్లకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, ఎస్ఎస్ఎస్ పీవోలు మాల్యాద్రి, పిచ్చమ్మ, అగ్నిమాపక సిబ్బంది రాము, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

**బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 16 :** బంగారుమెట్ట, ఎల్‌బీపీ అగ్రహారం గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులకు మంగళవారం అతిథి దేవోభవ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఆరిపాక కామేశ్వరరావు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వడదెబ్బ తగలకుండా విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బి.వెంకటరమణ, ఉపాధ్యాయులు కె.రాజు, కె.జగ్గారావు పాల్గొన్నారు.

### 21న ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్ష

**రావికమతం, ఏప్రిల్ 16 :** మరుపాక ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఈనెల 21వ తేదీ ఆదివారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకూ జరగనుందని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సత్య సునీల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రోజు పరీక్షకు హాజరు కానున్న విద్యార్థులు ఒరిజనల్ హాల్ టికెట్‌తో పాటు వారి ఆధార్ కార్డును విధిగా వెంట తీసుకుని రావాల్సిందిగా సూచించారు.

### పవర్ లిఫ్టింగ్‌లో ఉపాధ్యాయినికి పతకాలు




బంగారు పతకాన్ని అందుకుంటున్న నాగజ్యోతి

**రోలుగుంట, ఏప్రిల్ 16 :** అంబేడ్కర్ జయంతి సందర్భంగా విశాఖపట్నంలో నిర్వహించిన రెండో విశాఖ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో రోలుగుంట జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని నాగజ్యోతి సత్తాచాటారు. సీనియర్స్ మాస్టర్స్ డెడ్‌లిఫ్ట్ విభాగాల్లో రెండు బంగారు పతకాలను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టర్ భాస్కర్ తదితరులు అభినందించారు.

# కోడ్ ఉండగా గంధవరంలో పైపులైన్ పనులు

- వాటర్ ట్యాంకుకు రూ. కోటి మంజూరైందంటూ ప్రారంభం
- కాంట్రాక్టర్‌కు చెందిన వ్యక్తిని అనుమతి పత్రం చూపాలని కోరిన టీడీపీ నాయకులు
- వెంటనే అక్కడినుంచి నిష్క్రమించిన సూపర్‌వైజర్
- అధికారులు, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారులకు ఫిర్యాదు



పైపులైన్ పనులు చేయిస్తున్న సూపర్‌వైజర్



తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారికి టీడీపీ నాయకుల ఫిర్యాదు

**చోడవరం, ఏప్రిల్ 16 :** ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో మండలంలోని గంధవరం పంచాయతీలో రూ. కోటి నిధులతో వాటర్ ట్యాంకు మంజూరైందంటూ మంగళవారం హడావుడిగా పైపులైన్ కోసం తవ్వకాలు చేపట్టడం వివాదాస్పదంగా మారింది. గంధవరం కొండపై మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో పైపులైన్ వేసే పని చేపట్టడాన్ని గమనించిన టీడీపీ నాయకులు పల్లా అర్జున ఆధ్వర్యంలోని స్థానిక నేతలు పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు చెందిన సూపర్‌వైజర్ శ్రీనివాసులును అడ్డుకున్నారు. ఎన్నికల సమయంలో కొత్తపని చేపట్టకూడదని ఉన్నప్పటికీ ఈ వాటర్ ట్యాంకు పనులు ఎలా చేపడతారంటూ ప్రశ్నించారు. దీనిపై అతడు సమాధానం ఇస్తూ కాంట్రాక్టర్ విశాఖకు చెందిన కృష్ణప్రసాద్ అని, వాటర్ ట్యాంక్ పనులను చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కాంట్రాక్టర్‌కు చెప్పడంతో చేపడుతున్నామన్నారు. దీనిపై వాటర్ ట్యాంకు మంజూరైనట్టు ఉత్తర్వులు చూపించాలని టీడీపీ నాయకులు కోరారు. దీంతో అతడు ఎలాంటి సమాధానం ఇవ్వకుండా అక్కడి నుంచి నిష్క్రమించాడు. దీనిపై పల్లా అర్జున్ తదితరులు తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వాటర్ ట్యాంకు నిర్మాణానికి సంబంధించి ఎలాంటి శాంక్షన్ ఆర్డర్ లేకుండానే అధికార పార్టీ నేతల ప్రోద్బలంతో పైపులైన్ పనులు చేపట్టారని ఆరోపించారు. ముమ్మాటికీ ఇది ఎన్నికల కోడ్ అతిక్రమించడమేనని, దీనిపై సంబంధిత అధికారులతో పాటు, కాంట్రాక్టర్‌పైనా చర్యలు చేపట్టాలని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

### 'కూటమి అభ్యర్థుల విజయంతోనే రాష్ట్రాభివృద్ధి'



ప్రచారం చేస్తున్న సీఎం రమేష్ సోదరి విజయలక్ష్మి

**బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 16 :** కూటమి అభ్యర్థుల విజయంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అనకాపల్లి ఎంపీ కూటమి అభ్యర్థి సీఎం రమేష్ సోదరి విజయలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె ఎల్.సింగవరంలో ఉపాధి పనులు చేపడుతున్న కూలీలను కలిసి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజులకు ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరారు. వైసీపీ పాలనలో అన్నిరంగాల్లో నష్టపోయిన రాష్ట్రాన్ని చంద్రబాబు అభివృద్ధి పథంలోకి తెసుకు వెళ్లగలరన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రతినిధి ఈర్లె శ్రీరామూర్తి, నాయకులు డొంకిన అప్పలనాయుడు, సీతా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీకి పూర్వ వైభవమే అందరి లక్ష్యం కావాలి : పైలా



సమావేశానికి హాజరైన టీడీపీ శ్రేణులతో పైలా ప్రసాద్

**కె.కోటపాడు, ఏప్రిల్ 16 :** నియోజకవర్గంలో టీడీపీ పూర్వవైభవమే అందరి లక్ష్యం కావాలని ఆ పార్టీ మాడుగుల అసెంబ్లీ అభ్యర్థి పైలా ప్రసాదరావు అన్నారు. కె.కోటపాడులో మంగళవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో మాడుగుల నుంచి తనను, అనకాపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి సీఎం రమేష్‌ను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేష్, నాయకులు డోకల లక్ష్మీనరసింహమూర్తి, కన్నూరు నాగభూషణం, కన్నూరు సూర్యనారాయణ, లెక్కల మల్లేశ్వరరావు, జూరెడ్డి రాము, పైలా నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### రెవెన్యూ అధికారుల తీరుపై అప్పలమ్మపాలెం గ్రామస్థులు ఆగ్రహం

- వివాదాస్పద స్థలం రికార్డులు లేకుండా సర్వే ఎలా చేస్తారని ప్రశ్న
- వాస్తవాలు వెల్లడించకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరిక



అధికారులను నిలదీస్తున్న అప్పలమ్మపాలెం గ్రామస్తులు

**రావికమతం, ఏప్రిల్ 16 :** వివాదాస్పద స్థలానికి సంబంధించిన రికార్డులు తేకుండా గ్రామానికి విచారణకు మంగళవారం వచ్చిన రెవెన్యూ, సర్వే అధికారులను అప్పలమ్మపాలెం గ్రామస్తులు నిలదీశారు. ఈ గ్రామంలో సామాజిక భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని కొందరు అధికారుల సహకారంతో అక్రమ రిజిస్ట్రేషన్ వేరొకరికి చేయించుకొని, ఆరు సెంట్లు భూమిని కబ్జా చేశారన్న ఫిర్యాదుపై మండల సర్వేయర్ సత్యనారాయణ, ఆర్ఐ సతీష్, వీఆర్వో నారాయణరావు తదితరులు గ్రామానికి విచారణకు విచ్చేశారు. వివాదాస్పద స్థలాన్ని సర్వే చేయాలని అధికారులను గ్రామస్తులు కోరారు. ఈ స్థలానికి సంబంధించి సర్వే రికార్డు అందుబాటులో లేవని అధికారులు తెలపడంతో వారంతా మండిపడ్డారు. దీనిపై ఇప్పటికే ఒక పర్యాయం వచ్చి రికార్డులతో మళ్లీవచ్చి సర్వే చేసి వాస్తవం తెలియజేస్తామని చెప్పి, ఇప్పుడు రికార్డులు లేకుండా ఎలా వస్తారని ప్రశ్నించారు. స్థలానికి సంబంధించిన వాస్తవాలు వెల్లడించకుంటే తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని వారంతా హెచ్చరించారు.

### ఎట్టకేలకు ఆర్అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు



ఎం.కోటపాడు వద్ద రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

**మాడుగుల రూరల్, ఏప్రిల్ 16 :** ఎట్టకేలకు మండలంలోని వడ్డాది-పాడేరు అతి ప్రధానమైన రహదారి మరమ్మతు పనులకు నోచుకుంది. ఈ మార్గంలోని వడ్డాది నుంచి తాటిపర్తి వరకు సుమారు పద్నాలుగు కిలోమీటర్ల రహదారి గోతులుపడి అధ్వానంగా మారింది. వడ్డాది- తాటిపర్తి గ్రామాల మధ్యలో ముకుందపురం, కేజేపురం జంక్షన్, ఎం.కోటపాడు, ఎం.కె.వల్లాపురం, ఘాట్‌రోడ్డు జంక్షన్, సురవరం, సాగరం కోలనీ, ఎం.కోడూరు, కాశీపురం గ్రామాలున్నాయి. ఆయా గ్రామాల మీదుగా విశాఖ, అనకాపల్లి, చోడవరం తదితర ప్రాంతాల నుంచి పాడేరు జిల్లాకు పెద్ద సంఖ్యలో వాహనాలు వెళ్లివస్తుంటాయి. నిత్యం వందలాది మంది ప్రయాణం సాగిస్తుంటారు. వడ్డాది నుంచి ఘాట్‌రోడ్డు జంక్షన్‌కి చేరుకుని అక్కడ నుంచి మాడుగులకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో గత నాలుగేళ్లుగా ఈ రోడ్డు గోతులు పడి ఛిద్రంగా మారింది. వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తుండడంతో ఆయా గోతుల్లో క్రషర్‌బుగ్గి, కంకర రాళ్లు , వెట్‌మిక్స్ వేసి పూడ్చడం వంటివి చేశారు. మళ్లీ మూణ్ణాళ్లకే సమస్య మొదటికి వచ్చేంది. వాహనచోదకుల సమస్యలను గుర్తించిన అధికారులు ఎట్టకేలకు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతు పనులు చేపడుతున్నారు. ఇన్నాళ్లకైనా వాహనచోదకుల సమస్యలు గుర్తించారని పలువురు పేర్కొంటున్నారు.

### వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు



వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నదృశ్యం

**చీడికాడ, ఏప్రిల్ 16:** వేసవి దుక్కుల అనంతరం రైతులంతా భూసార పరీక్షలు చేయడం ద్వారా పంటలకు ఏఏ ఎరువులు వేయాలో గుర్తించేందుకు అవకాశం ఉంటుందని శ్రీకాకుళం నైరా కళాశాల, ఎన్‌జీ రంగ వ్యవసాయ విద్యాలయం విద్యార్థులు తెలిపారు. చెట్టుపల్లిలో ఈ రెండు కళాశాలల విద్యార్థులు మంగళవారం పర్యటించారు. స్థానికంగా ఉన్న వనరుల ద్వారా ఏఏ పంటలు పండిస్తున్నారో అడిగి తెలు సుకున్నారు. శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలి పారు. కొన్నెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం కో- ఆర్డినేటర్ రాజ్‌కుమార్, కిశోర్‌కుమార్, రాముునాయుడు పాల్గొన్నారు.

## మాడుగుల నియోజకవర్గం

### మోదకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో అమ్మ

**మాడుగుల, ఏప్రిల్ 16 :** ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత మోదకొండమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత అమ్మ వారిని విశేషంగా అలంకరించిన అనంతరం అర్చకులు అర్చనలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై పసుపు కుంకుమలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు ఘటాలను ఊరేగింపుగా తీసుకు వచ్చి సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### 'సచివాలయ ఉద్యోగులు కోడ్‌ను పాటించాలి'



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్‌డీవో ఉదయశ్రీ

**చీడికాడ, ఏప్రిల్ 16 :** ఎన్నికల కోడ్‌కు అనుగుణంగా నిబంధనలను సచివాలయ సిబ్బంది విధిగా పాటించాలని నర్సీపట్నం డీఎల్‌డీవో ఎం.ఉదయశ్రీ ఆదేశించారు. మండలంలోని తురువోలు, దిబ్బపాలెం, బైలపూడి, జి.కొత్తపల్లి గ్రామ సచివాలయాలతో పాటు అప్పలరాజుపురం మీ-సేవా కేంద్రాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీచేసిన అనంతరం మాట్లాడారు. ఎన్నికలు ముగిసే వరకు నిబంధనలకు లోబడి పనిచేయాలన్నారు. ఈ తనిఖీల్లో పంచాయతీ కార్యదర్శులు కె.నాగేశ్వరరావు, అనూష, పి.గోపి, రమేష్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### 20న చోడవరంలో 'మేమంతా సిద్ధం' సభ : బూడి



సమావేశంలో మాట్లాడుతున్న ముత్యాలనాయుడు

**దేవరాపల్లి, ఏప్రిల్ 16 :** జిల్లాలో ఈనెల 20వ తేదీన ప్రవేశించనున్న మేమంతా సిద్ధం బస్సు యాత్రను అంతా జయప్రదం చేయాలని అనకాపల్లి వైసీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయకుడు కోరారు. తారువలో పార్టీ మండల అధ్యక్షుడు బూరే బాబూరావు అధ్యక్షతన మంగవారం ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఆరోజు చోడవరంలో మధ్యాహ్నం మూడు గంటలకు బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిని ఈర్లె అనూరాధ, జడ్పీటీసీ కర్రి సత్యం తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

## 207 కిలోల గంజాయి స్వాధీనం

» ఇద్దరి అరెస్టు, పరారీలో మరో ఇద్దరు



స్వాధీనం చేసుకున్న గంజాయితో నర్సీపట్నం డీఎస్పీ మోహన్, సీఐ బి.హరి, సిబ్బంది

**కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 16:** ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు తరలించేందుకు కృష్ణాదేవిపేటలో నిల్వ వుంచిన 207 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేశామని నర్సీపట్నం డీఎస్పీ జీఆర్‌వీ మోహన్ తెలిపారు. దీనికి సంబంధించిన ఆయన తెలిపిన వివరాలిలా వున్నాయి. గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి పార్కు సమీపంలో ముళ్ల పొదల్లో గంజాయి నిల్వ ఉన్నట్టు కృష్ణాదేవిపేట పోలీసులకు సమాచారం అందిందన్నారు. దీంతో మంగళవారం తెల్లవారుజామున నర్సీపట్నం రూరల్ సీఐ బి.హరి, కృష్ణాదేవిపేట, మాకవరపాలెం ఎస్‌ఐలు ఉపేంద్ర, రామకృష్ణ తమ సిబ్బందితో దాడి చేశామన్నారు. అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం డౌనూరు గ్రామానికి చెందిన కునేప సతీశ్, రోలుగుంట మండలం నాయుడుపాలెం గ్రామానికి చెందిన బలిజి హరిబాబును గంజాయితో పట్టుకున్నట్టు తెలిపారు. వీరి నుంచి బైక్‌తో పాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని విశాఖపట్నం సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నారని, కేసు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు. గంజాయి కేసులో ప్రతిభ కనబరిచిన కృష్ణాదేవిపేట కానిస్టేబుళ్లు దుర్గాప్రసాద్, సతీశ్, చిరంజీవితో పాటు మాకవరపాలెం హెడ్‌కానిస్టేబుల్ శ్రీనుకు డీఎస్పీ మోహన్ నగదు ప్రోత్సాహం అందించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం రూరల్ సీఐ బి.హరి, కృష్ణాదేవిపేట, మాకవరపాలెం ఎస్‌ఐలు ఎం.ఉపేంద్ర, రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎనిమిది కిలోల గంజాయి స్వాధీనం

» ఇద్దరి అరెస్టు

**చీడికాడ, ఏప్రిల్ 16:** మండలంలోని వరహాపురం గ్రామ సమీపంలో పాడేరు ఏజెన్సీ గ్రామాల నుంచి చీడికాడ మీదుగా ఎనిమిది కిలోల గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి చోడవరం కోర్టుకు తరలించామని ఎస్‌ఐ బి.నారాయణరావు మంగళవారం విలేకరులకు తెలిపారు. వీరితో పాటు ఉన్న ఓ బాలుడిని జువైనల్ హోంకు తరలించామన్నారు. దీనికి సంబంధించి ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. వాహనాల తనిఖీల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం వరహాపురం సమీపంలో తనతో పాటు తన సిబ్బంది తనిఖీ చేస్తుండగా హుకుంపేట గ్రామానికి చెందిన కొర్రా అనిల్‌కుమార్, విశాఖపట్నానికి చెందిన పల్లి రాజుతోపాటు మరో బాలుడు రెండు ద్విచక్ర వాహనాలపై గంజాయిని తరలిస్తున్నారన్నారు. వాహనాలు తనిఖీ చేయగా ఎనిమిది కిలోల గంజాయి బయటపడిందన్నారు. గంజాయి, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని ఇద్దరిని మంగళవారం చోడవరం కోర్టుకి తరలించామని చెప్పారు. వీరితో పాటు ఉన్న బాలుడిని జువైనల్ హోంకు తరలించామని తెలిపారు.

## పందూరులో మద్యం స్వాధీనం

**కోటవురట్ల, ఏప్రిల్ 16:** మండలంలోని పందూరులో బెల్టు షాపుపై దాడిచేసి 42 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. పందూరు గ్రామానికి చెందిన బత్తుల నాగవెంకట సన్యాసిశెట్టి తన ఇంటిలో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్టు గుర్తుతెలియని వ్యక్తిఇచ్చిన సమాచారం మేరకు మంగళవారం దాడి చేశామన్నారు. 42 మద్యం క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నామని, ప్రభుత్వ ధరల ప్రకారం వీటి విలువ సుమారు రూ.7 వేలు వుంటుందని ఎస్‌ఐ చెప్పారు. నిందితుడిపై కేసు నమోదుచేసి అరెస్టు చేశామని ఎస్‌ఐ రమణయ్య తెలిపారు.

## 35 ఎకరాల్లో సరుగుడు తోటలు దగ్ధం



దగ్ధమవుతున్న సరుగుడు తోటలు

**బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 16:** పెదమదీనాలో మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించి 35 ఎకరాల సరుగుడు తోట దగ్ధమైంది. కాల్చిపారేసిన సిగరెట్టు కారణంగా సంభవించిన అగ్ని ప్రమాదంలో నమ్మి శ్రీనుకి చెందిన ఆరు ఎకరాలు, గడందాసు సత్తిబాబు 10, మల్లారపు గంగరాజు 2, దంద్రు గోవింద 1, రమణ 1, నూకరాజు 2, రాబడి 2, దాలిబోయిన కొండబాబు 1, మల్లారపు కేధారి 1, నారాజు 1, వెంకటస్వామికి చెందిన ఎకరంతో పాటు తదితరులకు చెందిన సరుగుడు తోటలు దగ్ధం కావడంతో బాధిత రైతులు విలపిస్తున్నారు. అనకాపల్లి, చోడవరం అగ్నిమాపక కేంద్రాల సిబ్బంది మంటలను అదుపు చేశారు.

### కుసర్లపూడి, బుచ్చెంపేటలో..

**రోలుగుంట:** మండలంలోని బుచ్చెంపేటలో మంగళవారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన చిటికెల రాజుబాబు, రెడ్డి రామయ్యమ్మ, గాలి సోమన్నమ్మ, గాలి నూకరాజులకు చెందిన మూడు ఎకరాల యూకలిప్టస్, టేకు తోటలు దగ్ధమయ్యాయి. అలాగే కుసర్లపూడిలో చుక్కా సత్తిబాబుకు చెందిన రెండు ఎకరాల జీడిమామిడి తోటలు అగ్నికి ఆహుతయ్యాయి. నర్సీపట్నం అగ్నిమాపక సిబ్బంది అక్కడికి వెళ్లి మంటలను అదుపు చేశారు.

## వ్యాపారిపై చీటింగ్ కేసు నమోదు

**అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16:** ఒక ప్రముఖ కంపెనీ పేరుతో నకిలీ గ్యాస్ స్టౌలను విక్రయిస్తున్న వ్యాపారిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ ఆలీ తెలిపారు. ఆయన వెల్లడించని వివరాల ప్రకారం... స్థానిక చిన్నవీధిలోని ఒక దుకాణంలో బట్టర్ ఫ్లై కంపెనీకి చెందిన దినేశ్ శివరామ్‌శెట్టితో పాటు మరొకరు 15 రోజుల క్రితం రెండు గ్యాస్ స్టౌలు కొనుగోలు చేశారు. వీటిని ముంబైకిలోని కంపెనీకి పంపించి పరిశీలన చేయించగా నకిలీవని నిర్ధారణ అయింది. దీంతో దినేశ్‌శివరామ్‌శెట్టి ఫిర్యాదు మేరకు దుకాణ ప్రతినిధిపై చీటింగ్ కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

## దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

**విశాఖపట్నం, ఏప్రిల్ 16:** వేసవి ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు.

**బెంగళూరు-మల్దా-బెంగళూరు**

06565 నంబరు గల రైలు ఈనెల 17 నుంచి జూన్ 26 వరకు ప్రతి బుధవారం సాయంత్రం 4.35 గంటలకు బెంగళూరులో బయలుదేరి మర్నాడు ఉదయం 9.56 గంటలకు దువ్వాడ, శుక్రవారం ఉదయం 7.30 గంటలకు మల్దా చేరుతుంది. తిరిగి ఈనెల 20 నుంచి జూన్ 29 వరకు ప్రతి శనివారం ఉదయం 8.50 గంటలకు మల్దాలో బయలుదేరి మర్నాడు ఉదయం 5.40 గంటలకు దువ్వాడ, సోమవారం ఉదయం 3.00 గంటలకు బెంగళూరు చేరుతుంది.

**సికింద్రాబాద్-సంత్రాగచ్చి-సికింద్రాబాద్**

07221 నంబరు గల రైలు ఈనెల 20 నుంచి జూన్ 29 వరకు ప్రతి మంగళ, శనివారం ఉదయం 6.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 7.55 గంటలకు దువ్వాడ, మర్నాడు ఉదయం 10.25 గంటలకు సంత్రాగచ్చి చేరుతుంది. తిరిగి ఈనెల 22 నుంచి జూన్ 30 వరకు ప్రతి బుధ, ఆదివారం మధ్యాహ్నం 12.20 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి మర్నాడు ఉదయం తెల్లవారుజాము 3.20 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 3.00 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది.

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | రూ.లలో |
|---|---|
| రైతు ధర | 108.00 |
| లైవ్ ధర | 128.00 |
| విత్ స్కిన్ | 226.00 |
| స్కిన్ లెస్ | 236.00 |

**కోడి గుడ్లు (నెక్)**

| వంద గుడ్లు | రూ.లలో |
|---|---|
| విశాఖపట్నం | 415 |
| విజయనగరం | 419 |
| శ్రీకాకుళం | 419 |

# గ్రామాన్ని తరలిస్తేనే ఎన్నికల్లో పాల్గొంటాం

» పెందుర్తి ఆర్‌ఓకు తేల్చి చెప్పిన తాడి గ్రామస్థులు




తాడి గ్రామస్థులతో సమావేశమైన పెందుర్తి ఆర్‌వో శేషశైలజ

**పరవాడ, ఏప్రిల్ 16:** వచ్చే నెలలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ను బహిష్కరించే విషయంలో తాము వెనక్కు తగ్గేది లేదని మండలంలోని తాడి గ్రామస్థులు పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల రిట్నరింగ్ అధికారిణి శేషశైలజకు తేల్చి చెప్పారు. ఫార్మా కాలుష్య కోరల్లో చిక్కుకున్న తమ గ్రామాన్ని తరలించడంలో ప్రభుత్వం, అధికారులు పూర్తిగా విఫలమయ్యారని, ఇందుకు నిరసనగా ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టు తాడి గ్రామస్థులు ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మంగళవారం తాడి గ్రామంలో ఆమె 'సీప్' సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాలుష్య సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని, సార్వత్రిక ఎన్నికలకు సహకరించాలని కోరారు. దీంతో పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ, తమ సమస్యను గతంలోనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని, మీరు మరోసారి తీసుకువెళ్లాల్సిన అవసరం లేదని అన్నారు. గ్రామాన్ని తరలిస్తామని లిఖితపూర్వకంగా హామీ ఇస్తేనే ఎన్నికల్లో పాల్గొంటామని స్పష్టం చేశారు. రిట్నరింగ్ అధికారిణి శేషశైలజ ప్రతిస్పందిస్తూ.. గ్రామ తరలింపునకు ఎలాంటి హామీ ఇవ్వలేనని, మరోసారి ఆలోచించుకుని ఎన్నికల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ మాదంశెట్టి నీలబాబు, మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు, నాయకులు కోమటి అచ్చిబాబు, కోమటి సూరిబాబు, గనిరెడ్డి కనకారావు, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ బాలసూర్యారావు, తహసీల్దార్ గణపతిరావు, ఎంపీడీవో కీర్తిస్పందన, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సింహాద్రి ఎన్టీపీసీ కాలుష్యంతో పలు రకాల సమస్యలు

» మూలస్వయంభూవరం గ్రామాన్ని తరలించాల్సిందే



నినాదాలు చేస్తున్న గ్రామస్థులు

**పరవాడ, ఏప్రిల్ 16:** సింహాద్రి ఎన్టీపీసీ కాలుష్యం బారిన పడిన తమ గ్రామాన్ని తరలించాలని మూలస్వయంభూవరం ప్రజలు మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ఎన్టీపీసీ నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళి కారణంగా రోగాలబారిన పడుతున్నామన్నారు. నీటి వనరులు కలుషితమయ్యాయని, తాగునీటిని కొనుక్కోవాల్సి వస్తున్నదని, పంటలు పాడైపోతున్నాయని, పశువులు మృత్యువాత పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పలువురు ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, నేత్ర సంబంధ సమస్యలతో బాధపడుతున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి బాబురావు, భానుప్రసాద్, కె.లక్ష్మి, అప్పలనాయుడు, గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# కూటమి అభ్యర్థుల గెలుపునకు సహకరించండి

» బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ వినతి

» యాదవ సామాజిక వర్గీయులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రమేశ్

**అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16:** రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయానికి సహకరించాలని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ కోరారు. మంగళవారం కొణతాల సుబ్రహ్మణ్యం కల్యాణ మండపంలో యాదవ సామాజిక వర్గీయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటు అభివృద్ధి పనులు, అటు సంక్షేమ పథకాలకు సమాన ప్రాధాన్యం ఇస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, ఇందుకు కూటమి కట్టుబడి వుందని అన్నారు. అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు. జనసేన పార్టీ అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, ఎన్నికల అనంతరం రాష్ట్రంతోపాటు కేంద్రంలో కూడా ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తుందని పేర్కొన్నారు. యాదవ సామాజిక వర్గీయులంతా కూటమి అభ్యర్థుల గెలుపునకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎస్ మాధవ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, యాదవ సంక్షేమ సంఘం ప్రతినిధులు భరణికాన బాబురావు, భరణికాన నరసింహమూర్తి, సబ్బి శ్రీనివాసరావు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలకు సరకులన్నీ ఒకేసారి పంపిణీ చేయాలి

» వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగశేషు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న నాగశేషు

**అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16:** అంగన్‌వాడీ కేంద్రాలకు సరకులకు సకాలంలో, సక్రమంగా పంపిణీ చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగశేషు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు ఇవ్వాల్సిన టేక్ హోమ్ రేషన్‌కు సంబంధించి అన్ని రకాల సరకులను ఒకేసారి కేంద్రాలకు పంపిణీ చేయడం లేదని, లబ్ధిదారులకు అన్ని సరకులు ఒకేసారి ఇస్తేనే ఎఫ్‌ఆర్ఎస్ యాప్‌లో నమోదు అవుతుందని చెప్పారు. కానీ సరకులు ఇవ్వకుండానే.. ఇచ్చినట్టుగా యాప్‌లో నమోదు చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. టీచర్, ఆయాలు ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కేంద్రంలోనే ఉండాలన్న అధికారుల ఆదేశాలపై ఆందోళన నిర్వహిస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి వివిధ యాప్‌లను ఒకే యాప్‌గా మారుస్తామని సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి, సభ్యులు వీవీ రమణమ్మ, కె.రామలక్ష్మి, తనూజ, ఉమా నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ పాలనలో యువతకు అన్యాయం

» టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టాభిరామ్




మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టాభి, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

**నర్సీపట్నం, ఏప్రిల్ 16:** వైసీపీ పాలనలో యువతకు అన్యాయం జరిగిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.పట్టాభిరామ్ అన్నారు. మంగళవారం బలిఘట్టంలో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ శక్తి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాదయాత్రలో యువతకు జగన్మోహన్‌రెడ్డి అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేశారన్నారు. ఉత్తరాంధ్రను గంజాయి, డ్రగ్స్‌కి అడ్డాగా మార్చేశారని విమర్శించారు. గత ఎన్నికలకు ముందు కోడి కత్తి డ్రామా ఆడాడని, ఓడిపోవడం ఖాయమని తెలుసుకొని సానుభూతి కోసం ఇప్పుడు గులకరాయి డ్రామా ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇక్కడున్న పిల్ల సైకో నర్సీపట్నంలో ఏ అభివృద్ధి చేశాడో చెప్పాలని ఎమ్మెల్యే గణేశ్‌ను ఉద్దేశించి అన్నారు. అయ్యన్నపాత్రుడు తీసుకొచ్చిన ఏరియా ఆస్పత్రి అంటే డెలివరీ కేసులు చేయడంలో రాష్ట్రంలోనే మంచి పేరు ఉండేదని, ఇప్పుడు విద్యుత్ సరఫరా నిలిచిపోతే టార్చ్‌లైట్లు వేసుకొని ఆపరేషన్లు చేస్తున్నారని అన్నారు. అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ మాట్లాడుతూ కేంద్రంలో తనకున్న పరిచయాలతో పరిశ్రమలు తీసుకొచ్చి ఈ ప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని చెప్పారు. ఉద్యోగ అవకాశాలు కల్పించే ముఖ్యమంత్రి కావాలా ? యువతను డ్రగ్స్‌కి అలవాటు చేసే ముఖ్యమంత్రి కావాలా? అన్ని ప్రశ్నించారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ వంగవీటి రంగా దేనికి ఆశించకుండా బడుగు బలహీన వర్గాల కోసం పని చేశారని తెలిపారు. బతికున్నప్పుడు చేసిన మంచి పనులే చనిపోయిన తరువాత ప్రజలు గుర్తుంచుకుంటారన్న దానికి నిదర్శనంగా రాష్ట్ర వ్యాప్తంగా వంగవీటి రంగా విగ్రహాలు కనిపిస్తాయని చెప్పారు. అంతకు ముందు వంగవీటి రంగా తనయుడు రాధా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, పుచ్చా విజయ్, బండారు వంశీకృష్ణ, జనసేన ఇన్‌చార్జి సూర్యచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కాపులంతా కూటమి వైపు నిలబడాలి

» కాపు జేఏసీ సభ్యులు ఆరేటి ప్రకాశ్



సంఘీభావం తెలుపుతున్న కాపు సంఘాల జేఏసీ ప్రతినిధులు

**విశాఖపట్నం, ఏప్రిల్ 16:** అన్ని విధాలా వంచించిన వైసీపీ వైపు కాకుండా, కాపులంతా ఈ ఎన్నికల్లో కూటమి వైపు నిలబడాలని కాపు జేఏసీ సభ్యులు ఆరేటి ప్రకాశ్, కాపు ఉద్యమ నేత ఆకుల రామకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం విశాఖ ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాపునేతలంతా కూటమి అభ్యర్థులకు మద్దతుగా సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈడబ్ల్యూసీ రిజర్వేషన్ 5 శాతం అమలుకాక, కాపు విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కాపులకు సబ్సిడీ రుణాలు ఇవ్వలేదన్నారు. ఈస్థితిలో రాష్ట్రం బాగుండాలంటే దూరదృష్టి ఉన్న చంద్రబాబు వల్లే సాధ్యమన్నారు. జగన్మోహన్ రెడ్డి కాపులకు తీరని అన్యాయం చేశారన్నారు. ఎక్కువగా కౌలు రైతుల ఉన్న కాపు కులాన్ని అణగదొక్కారన్నారు. తమ సామాజిక వర్గం అన్ని రంగాల్లో వెనకబడిపోయిందన్నారు. కూటమి ఏర్పాటులో ప్రధాన పాత్ర పోషించిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామన్నారు. గతంలో పోరాడి కాపు కార్పొరేషన్ సాధించుకుని ఎన్నో ప్రయోజనాల పొందామన్నారు. ఈడబ్ల్యూసీలో 5 శాతం రిజర్వేషన్ కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు చంద్రబాబుతోనే సాధ్యమైందన్నారు. పోరాడి సాధించుకున్న ఈడబ్ల్యూసీ రిజర్వేషన్ వైసీపీ పూర్తిగా అమలు చేయక విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దూరమయ్యారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 500 పైగా కాపు భవనాలను నిర్వీర్యం చేసిన ఘనత వైసీపీకి చెందిందన్నారు. విదేశీ విద్యను మూడేళ్లుగా పరిగణనలోకి తీసుకోకుండా మోసం చేశారన్నారు. ఈస్థితిలో కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు చెందిన వారంతా వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. రాజధాని, పోలవరం ప్రాజెక్టు పూర్తిగా నాశనం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మల సత్యారావు, ప్రగడ చిన నాగేశ్వరరావు, కర్రి వెంకటరమణ, సిరిసిపల్లి రమణ, మార్కినీడు మణికంఠ, అన్నం వెంకటరావు, తోట రామానుజం, గొల్లకోట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వూషూ రిఫరీగా మౌనిక ఎంపిక



సర్టిఫికెట్ అందుకుంటున్న మౌనిక

**నర్సీపట్నం, ఏప్రిల్ 16:** రాష్ట్ర స్థాయిలో వూషూ రిఫరీగా మౌనిక అర్హత సాధించింది. ఈ నెల 13 నుంచి 15 వరకు సింహాచలంలోని ఇండోర్ హాల్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి రిఫరీ, జడ్జి సెలక్షన్స్ నిర్వహించారు. ఇందులో వూషూ కోచ్‌గా వ్యవహిస్తున్న వేపాడ మౌనిక సర్టిఫికెట్ సాధించి వూషూ రిఫరీగా అర్హత సాధించింది.

## ఉపాధి పనుల్లో మహిళకు అస్వస్థత



ఉపాధి పనులు చేస్తుండగా అస్వస్థతకు గురైన చిన్నమ్మలు

**గొలుగొండ, ఏప్రిల్ 16:** మండలంలో ఉపాధి పనులు చేస్తుండగా ఎండ తీవ్రతకు జోగంపేట గ్రామానికి చెందిన చిటికెల చిన్నమ్మలు అస్వస్థతకు గురైంది. మండలంలో మంగళవారం ఉదయం జోగంపేట గ్రామ పంచాయతీకి చెందిన ఉపాధి కూలీలు గర్సింగి అటవీ ప్రాంతంలో జీడి మామిడి తోటల్లో ఉపాధి పనులు నిర్వహిస్తున్నారు. పనులు నిర్వహిస్తుండగా చిటికెల చిన్నమ్మలు వడదెబ్బకు ఒక్కసారిగా కిందపడిపోయినట్టు సహచర కూలీలు తెలిపారు. ఆమెను గొలుగొండ పీహెచ్‌సీకి తరలించారు. వైద్యం అందించిన అనంతరం ఆమె కోలుకుంది. ఉపాధి పనులు నిర్వహించే ప్రదేశంలో టెంటు ఏర్పాటు చేయాలని అధికారులను కూలీలు కోరుతున్నారు.

## బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌ను కలిసిన వంగవీటి రాధ




బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌తో మాట్లాడుతున్న వంగవీటి రాధ

**అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16:** అనకాపల్లి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి సీఎం రమేశ్‌ను వంగవీటి రంగ తనయుడు వంగవీటి రాధ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం సాయంత్రం స్థానిక జాతీయ రహదారి పక్కనున్న బీజేపీ కార్యాలయానికి వచ్చిన వంగవీటి రాధకు, బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన సీఎం రమేశ్‌ను కలిసి పలు విషయాలపై మాట్లాడారు.

## ఎన్నికల సిబ్బందికి శిక్షణ



శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

**మాడుగుల, ఏప్రిల్ 16:** ఎన్నికల విధులకు సంబంధించి మాడుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి జీవీ సత్యవాణి ఆధ్వర్యంలో సిబ్బందికి మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. 252 మందికి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కేంద్రాన్ని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సందర్శించారు. శిక్షణ తరగతులపై ఆర్‌వో నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ టి.సత్యనారాయణ, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.రాజా, సీనియర్ అసిస్టెంట్ వి.పూర్ణయ్య, ఈవోపీఆర్‌డీ మీనా కుమారి, ఆర్‌ఐ, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

## చెక్‌పోస్టుల్లో ముమ్మర తనిఖీలు

» ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశం

**అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 16:** చెక్‌పోస్టులు, డైనమిక్ చెక్‌పోస్టుల్లో ముమ్మర తనిఖీలు చేయాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నెల వారి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా డబ్బు, మద్యం, ఉచిత కానుకల రవాణాకు అడ్డు కట్టవేయాలన్నారు. రాజకీయ నాయకుల ఎన్నికల బహిరంగ సభల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ సందర్భంగా ఎన్నికల నియమావళి ప్రకారం బందోబస్తు ఏర్పాట్లు చేయాలని, అభ్యర్థులకు సంబంధించి మూడు వాహనాలు మాత్రమే నామినేషన్ సమయంలో రిటర్నింగ్ కార్యాలయానికి అనుమతించాలన్నారు. అభ్యర్థితో సహా ఐదుగురిని మాత్రమే రిటర్నింగ్ అధికారి చాంబర్‌లోకి అనుమతించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ విజయభాస్కర్, డీఎస్పీ సత్యనారాయణ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## వెన్నెలపాలెంలో పట్టపగలు చోరీ

» 8.25 తులాల బంగారు ఆభరణాలు అపహరణ

**పరవాడ, ఏప్రిల్ 16:** మండలంలోని వెన్నెలపాలెం పంచాయతీ బీసీ కాలనీలో మంగళవారం పట్టపగలు దొంగతనం జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు ప్రవేశించి బీరువాలో ఉన్న 8.25 తులాల బంగారం ఆభరణాలు ఎత్తుకెళ్లిపోయారు. ఈ సంఘటనకు సంబంధించి సీఐ బాల సూర్యారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బీసీ కాలనీకి చెందిన చుక్క రమాదేవి, అత్త పైడమ్మతో కలిసి నివాసం ఉంటున్నారు. పైడమ్మ ఉదయాన్నే బజారుకు వెళ్లిపోగా రమాదేవి ఎన్టీపీసీలో కూలీ పనికి వెళ్లింది. పైడమ్మ మధ్యాహ్నం 12 గంటలకు ఇంటికి వచ్చేసరికి ప్రధాన ద్వారం తెరిచి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బెడ్‌రూమ్‌లోని బీరువా తెరిచి వుంది. ఇందులో భద్రపరిచిన 8.25 తులాల బంగారం ఆభరణాలు చోరీకి గురైనట్టు గుర్తించింది.విషయాన్ని రమాదేవికి ఫోన్ ద్వారా తెలియజేసింది. సాయంత్రం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. సీఐ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్లూస్‌టీమ్ వచ్చి వివరాలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.